PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 132 | విజయవాడ, గురువారం 14 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 14 December 2023 | Rs

ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి

- కొద్దిపోస్టులకే నోటిఫికేషన్ సరికాదు
- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ


● లోపలి పేజీలో.. ●

15 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ ప్రక్రియ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి బుధవారం సర్క్యులర్ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీస్ ఆఫ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యాక్ట్ 2023 ప్రకారం 2012 జూన్ 2 తరువాత ఉద్యోగంలో చేరినవారిని అర్హులుగా పేర్కొన్నారు. అఆఇస్త్రఆ.ఖఙూఏట-ంం.ఆఅ వెబ్‌సైట్‌లో ఈ నెల 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దరఖాస్తులను శాఖల అధిపతులు ప్రాథమికంగా నిర్ధారించిన తర్వాత ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టరేట్ ఆడిట్ చేస్తుందని, అనంతరం వాటిని ఆర్థికశాఖ ఖరారు చేస్తుందన్నారు. సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ 9985980996, 9989253084, 9441537344ను సంప్రదించాలని సూచించారు.

భద్రత డొల్ల



- ఉలిక్కిపడ్డ పార్లమెంటు
- లోక్‌సభలో విజిటర్ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన వ్యక్తి
- బిజెపి ఎంపి ఇచ్చిన పాస్ తో చొరబడ్డ దుండగులు
- కలర్ స్మోక్ వదిలి భయభ్రాంతులు
- బయటకు పరుగులు తీసిన ఎంపిలు
- లోక్‌సభ స్పీకర్ చైర్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నం
- పట్టుకున్న ఎంపిలు... భద్రతా సిబ్బందికి అప్పగింత
- విజిటర్ పాస్ లు రద్దు... భద్రతలో భారీ లోపం

పార్లమెంట్‌పై 22 ఏళ్ల క్రితం జరిగిన ఉగ్రవాద దాడిని స్మరించుకున్న రోజే.. కొత్త పార్ల మెంటులో పార్లమెంటులో ఎంపీల సాక్షిగా ఘోర భద్రతా ఉల్లంఘన చోటు చేసుకుంది. దీంతో లోక్‌సభలో అసాధారణ, దిగ్భ్రాంతికరమైన సన్నివేశాలు నెలకొన్నాయి. మైసూర్-కొడగు బిజెపి ఎంపీ ప్రతాప్ సిన్హ ఇచ్చిన పాస్‌తోనే ఇద్దరు దుండగులు లోక్‌సభలో ప్రవేశించి అలజడి సృష్టించారు. ఓ వ్యక్తి పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకగా.. మరో వ్యక్తి గ్యాలరీ నుంచి ఒక రకమైన పొగ (కలర్ స్మోక్)ను వదిలి భయభ్రాంతులకు గురిచేశాడు. అదే సమయంలో పార్లమెంటు వెలుపల ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఒక మహిళతో సహా ఇద్దరు వ్యక్తులు నినాదాలిస్తూ హల్‌చల్ చేశారు. వీరినల్గురిని భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టాయి. మొత్తం మీద ఈ వ్యవహారం భద్రతా వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తి చూపింది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

ప్రజాశక్తి- ఢిల్లీ బ్యూరో :

లోక్‌సభలో బుధవారం భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పించింది. సభలో ఒక్కసారిగా తీవ్ర అలజడి చోటు చేసుకుంది. సందర్శకుల గ్యాలరీ నుండి ఇద్దరు వ్యక్తులు హఠాత్తుగా సభలోకి దూకి అలజడి సృష్టించారు. సిలిండర్ ఆకారంలో ఉండే గ్యాస్ డబ్బాలను తమ వెంట తెచ్చుకున్న దుండగులు జీరో అవర్‌లో సభలో ప్రవేశించారు. వారిలో ఓ వ్యక్తి సభ్యులు కూర్చునే బెంచీలపై దూకుతూ కన్పించగా మరొకడు గ్యాలరీ నుండి కిందికి వేలాడుతూ డబ్బాలోని గ్యాస్‌ను బయటికి వదిలాడు. దీంతో సభలో తీవ్ర అలజడి, గందరగోళం ఏర్పడింది. దుండగులు ఇద్దరూ మైసూరుకు చెందిన బిజెపి ఎంపీ ప్రతాప్ సింహ నుండి పాస్‌లు తీసుకొని సభలో ప్రవేశించారని కొందరు ఎంపిలు తెలిపారు. కలకలం రేపిన ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, దర్యాప్తు బృందాలు, ఇంటెలిజెన్స్ అధికారులు, ఫోరెన్సిక్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. చట్టవిరుద్ధంగా సభలో ప్రవేశించి అలజడి సృష్టించిన నిందితులను సాగర్ శర్మ, మనోరంజన్‌గా గుర్తించారు. వారి వద్ద నుండి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారుల కథనం ప్రకారం నిందితులిద్దరూ మైసూర్‌కు చెందిన వారు. సాగర్ శర్మ బెంగళూరులో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు నిమిత్తం అధికారులు నిందితుల నివాసాలకు చేరుకొని వారి నేపథ్యాన్ని ఆరా తీశారు. వారికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలేమైనా ఉన్నాయా అన్న దానిపై దృష్టి సారించాయి. మరోవైపు ఫోరెన్సిక్ అధికారులు అవసరమైన మిగతా 7లో



పార్లమెంటులో లోక్‌సభ స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్తున్న దుండగుడు.. భయాందోళనలో ఎంపిలు

ఉన్నత స్థాయి విచారణ



'భద్రతా వైఫల్యపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం. ఈ ఘటన నేపథ్యంలో కొత్త పార్లమెంటు భవనంలో సెక్యూరిటీని సమీక్షించడం జరుగుతుంది. నిందితులు వదిలిన పొగ సాధారణమైనదే అని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దుండగులను పట్టుకోవడంలో ఎంపీలు, సిబ్బంది చూపిన చొరవ ప్రశంసనీయం.'

-ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్

ప్రభుత్వానిదే బాధ్యత



'సెక్యూరిటీ సిబ్బంది కాదు. ఎంపిలందరూ కలిసి ఆగంతకుడిని పట్టుకున్నారు. 2001 పార్లమెంట్‌పై దాడిలో అమరులైనవారిని ఉదయమే స్మరించుకున్నాము. ఇంతలోనే సభలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే, దీనికి ప్రభుత్వానిదే బాధ్యత'

-కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత అధిర్ రంజన్

బిజెపి ఎంపిపైనా సమగ్ర దర్యాప్తు



పార్లమెంటుపై ఉగ్రవాద దాడి జరిగి 22 ఏళ్లు అయిన నేపథ్యంలో బుధవారం చోటుచేసుకున్న ఘటన అలవిమాలిన భద్రతా వైఫల్యానికి నిదర్శనం. ఈ ఘటనలో దుండగుల ప్రవేశానికి వీలు కల్పించిన కర్ణాటక బిజెపి ఎంపితో సహ బాధ్యులందరిపైనా సమగ్రంగా, వేగంగా దర్యాప్తు చేయాలి.

- సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి

నిండా మునిగాం...

- తేరుకోలేని దెబ్బ తగిలింది... అదుకోండి
- కేంద్ర బృందం వద్ద రైతుల ఏకరువు
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో హడావిడిగా పర్యటన



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరులో పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, చిత్రంలో శోభనాద్రీశ్వరరావు, హరిబాబు

ప్రజాశక్తి- కృష్ణాప్రతినిధి, అమర్తలూరు (బాపట్ల జిల్లా)

'నిండా మునిగాం. తేరుకోలేని దెబ్బ తగిలింది. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అదుకోవాలి. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చూడాలి' అని పలువురు రైతులు కేంద్ర బృందం వద్ద ఏకరువు పెట్టారు. మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాలైన కృష్ణా, బాపట్ల జిల్లాల్లో అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం (ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం) బుధవారం పర్యటించింది. ఈ బృందానికి పలువురు వినతి పత్రాలు అందజేశారు. జాతీయ విపత్తు నిర్వహణ (ఎన్‌డిఎం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ నేతృత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎడి మహేంద్ర చందేలియా, కేంద్ర రోడ్డు రవాణా హైవేస్ మంత్రిత్వ శాఖ విజయవాడ ప్రాంతీయ కార్యాలయ అధికారి రాకేష్ కుమార్‌తో కూడిన బృందం కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరు, పామర్రు మండలం నిమ్మలూరు, గుడివాడ మండలం రామన్నపూడి, వలివర్తిపాడు గ్రామాల్లో నేలవాలి నీట మునిగి మొలకలొచ్చిన వరి పొలాలను పరిశీలించింది. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం గోవాడలో రైతులతో మాట్లాడింది. కంకిపాడు, గోవాడల్లో ఏర్పాటు చేసిన తుపాను నష్టాల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా కృష్ణా జిల్లాలో జరిగిన నష్టాన్ని జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ కేంద్ర బృందానికి వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 2,54,655 ఎకరాల్లో వరి, 2284 ఎకరాల్లో మిగతా 2లో

'స్కిల్' కేసు సిబిఐకిస్తే అభ్యంతరం లేదు

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్రం

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసు దర్యాప్తును సిబిఐ లేదా ఇడితో దర్యాప్తునకు ఆదేశిస్తే తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ స్కామ్ దర్యాప్తులో అనేక అక్రమాలు జరిగినట్లుగా గుర్తించాం. మనీలాండరింగ్ కూడా జరిగింది. సిఆర్‌డిఎ పరిధిలో జరిగిన అసైన్డ్ భూముల స్కామ్, ఎపి ఫైబర్ నెట్ కేసులో సిఐడి 2020లోనే దర్యాప్తు చేపట్టింది.

ఈ స్కామ్‌లపై సిబిఐ దర్యాప్తు చేయాలని కోరాం. సిబిఐ రాష్ట్రంలోకి వచ్చి దర్యాప్తునకు అంగీకారం జిఓ కూడా జారీ చేశాం. తాజా వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తే అభ్యంతరం లేదు' అని కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నట్లు ఎజి ఎస్ శ్రీరామ్ చెప్పారు. స్కిల్ స్కామ్ దర్యాప్తును సిబిఐకి బదిలీ చేయాలంటూ మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌ను జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

- నిరసనలతో హోరెత్తిన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు
- అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు



విశాఖ నగరంలోని మర్రిపాలెం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీల సమ్మె ఉధృతమైంది. ప్రభుత్వ అవాస్తవ ప్రకటనలో వారిలో మరింత పట్టుదల పెరిగింది. రెండో రోజు బుధవారం కలెక్టరేట్లు, ఐసిడిఎస్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో ఆందోళనలను తీవ్రతరం చేశారు. వీటిలో పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు పాల్గొనడంతో ఆయా ప్రాంతాలు హోరెత్తాయి. పలు జిల్లాల్లో వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించడంతోపాటు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, గుంటూరు తదితర జిల్లాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు చట్టిబిడ్డలతో సహా దీక్షల్లో పాల్గొన్నారు. తమ బతుకులు చీకటిలో ఉన్నాయంటూ, రాష్ట్ర ప్రభుత్వం మనసు మారి సమస్యలు పరిష్కరించాలంటూ పార్వతీపురంలో అంగన్‌వాడీలు దీపోత్సవం నిర్వహించి నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్ల ఐసిడిఎస్ కార్యాలయం వద్ద వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ, భీమడోలులో కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. జంగారెడ్డిగూడెం, మండవల్లి, కలిదిండిల్లో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. బాపట్ల, చింతలపూడి, టి.నరసాపురంలో ర్యాలీ నిర్వహించారు. చీరాలలో మానవహారంగా ఏర్పడ్డారు. చిత్తూరులో మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పలువులు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, సిపిఎం, సిపిఐ, టిడిపి, బిఎస్‌పి, జనసేన, సిఐటియు, ఎఐటియుసి, ఇఫ్‌టియు, గిరిజన సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరుకోం : సిహెచ్.నరసింగరావు

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను మిగతా 2లో

అంతానికి ఆరంభం

- శిలాజ ఇంధనాల వినియోగంపై తీర్మానం
- ముగిసిన సదస్సు



ముగింపు సమావేశంలో కాప్ నేతలు

న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో దుబాయ్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన వాతావరణ సదస్సు (కాప్-28) బుధవారం ముగిసింది. వాస్తవానికి మంగళవారమే సదస్సు ముగియాల్సిఉన్నప్పటికీ కొన్ని అంశాలపై వ్యక్తమైన భిన్నాభిప్రాయల నేపథ్యంలో బుధవారం నాడు కూడా కొనసాగింది. సదస్సు ముగింపు సందర్భంగా 'అంతానికి ఆరంభం' (బిగినింగ్ ఆఫ్ ది ఎండ్) పేరిట శిలాజ ఇంధనాల వినియోగంపై ఒక తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. 'దుబాయ్ ఏకాభిప్రాయం' పేరుతో ఈ తీర్మానాన్ని విడుదల చేశారు. ప్యారిస్ ఒప్పంద పురోగతి భాగస్వామ్య (గ్లోబల్ స్టాక్‌టేక్) లక్ష్యాల్లో భాగంగా ఈ తీర్మానాన్ని చేశారు. న్యాయమైన, సక్రమమైన, సమానమైన రీతిలో శిలాజ ఇంధన వినియోగం నుండి ప్రత్యామ్నాయ వ్యవస్థకు మారాలని 196 పేరాగ్రాఫ్‌లతో 21పేజీల్లో ఉన్న ఈ తీర్మానం ప్రపంచ దేశాలను కోరింది. తొలుత ఈ తీర్మానం ఆమోదించే విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. బొగ్గు వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగాను సైతం క్రమేణా తగ్గించుకుంటూ

శిలాజ ఇంధనాల వినియోగాన్ని 2050 నాటికి సున్నా స్థాయికి తీసుకురావలన్న ప్రతిపాదనను నూతన పారిశ్రామిక దేశాలుగా రూపొందుతున్న బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా, ఇండియా, చైనా (బేసిక్ దేశాలు)లతో పాటు, లైక్ మైండెడ్ గ్రూపు ఆఫ్ డెవలపింగ్ కంట్రీస్ (ఎల్ఎండిసి) తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో తక్షణమే నిలిపివేయడం వంటి పదాలను తొలగించారు. బాషను కూడా కొంత సరళీకరించారు. ఈ చర్య పట్ల ధనిక దేశాలు అసంతృప్తిని వ్యక్తం చేసినప్పటికీ తీర్మానానికి ఆమోదం తెలిపాయి. తీర్మానంపై చర్చల సందర్భంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వ్యవస్థకు మారడానికి తమకు సాంకేతిక సాయంతోపాటు, ప్రత్యేకంగా ఆర్థిక సాయాన్ని అందించాలంటూ పేద దేశాలు చేసిన విజ్ఞప్తిని అమెరికాతో పాటు ఇతర ధనిక దేశాలు తిరస్కరించాయి. ఆఫ్రికన్ దేశాలు ఈ తరహా సాయం కోసం పట్టుబట్టాయి.

కాప్ సదస్సు నుండి ఆఫ్ఘనిస్తాన్ బహిష్కరణ

ఐక్యరాజ్య సమితి నిర్వహించే వాతావరణ చర్చల నుండి వరుసగా మూడో ఏడాది కూడా ఆఫ్ఘనిస్తాన్ బహిష్కరణకు గురైంది. ఒకపక్క ఆఫ్ఘనిస్తాన్ తీవ్రమైన వరదలు, కరువులతో మిగతా 7లో

రెవెన్యూలో ప్రక్షాళన!

- అనర్హులకు మంజూరు చేసిన పాస్ పుస్తకాలు తొలగింపు
- అర్హులకు భూ యాజమాన్య హక్కులు కల్పించండి
- కలెక్టర్లకు సిసిఎల్ఎ ఉత్తర్వులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వే ఒక వైపు నిర్వహిస్తూనే మరో వైపు భూ రికార్డుల్లో ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకు సంబంధించి రెవెన్యూశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు కారణాలతో అనర్హులకు మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేసి, ఆయా భూములకు సంబంధించి అర్హులైన భూ యజమానులకు యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సిసిఎల్ఎ కమిషనరు సాయి ప్రసాద్ ఈ నెల 8న 26 జిల్లాల కలెక్టర్లకు ఉజారీ చేశారు. భూములకు సంబంధించి అసలైన పట్టాదారులు భూములపై లేరని, వారి స్థానంలో ఇతరులు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినట్లు తాము గుర్తించినట్లు ప్రభుత్వం దృష్టికి రెవెన్యూ యంత్రాంగం తీసుకెళ్లింది. ప్రభుత్వం నుంచి అనర్హులు పొందిన పట్టాదారు పాస్ పుస్తకాలతో అనేక మంది బ్యాంకుల్లో రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు పొందడం, భూములను తనఖాపెట్టి రుణాలు పొందడం జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూమి తమది కాకపోయినా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రక్రియలో తప్పులు దొర్లకుండా చూడాలని ఉత్తర్వుల్లో తెలిపారు. భూములు రీ సర్వే పూర్తయిన లేక ఇంకా సర్వే చేపట్టని గ్రామాల్లో నిజమైన భూ యజమానులు కాని వారిని రికార్డుల్లోంచి తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన పట్టాదారుల పేర్లను వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో చేర్చాలని, వారికి భూ యాజమాన్య హక్కు పత్రాలు మంజూరు చేయాలని జిల్లాల కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర జోక్యాన్ని అడ్డుకోండి

- కేంద్రం చర్యలతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,07,513.09 కోట్లు వ్యయ నష్టం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం

● లోపలి పేజీలో.. ●

'పుష్ప' తరహాలో గంజాయి సరఫరా

- కంటైనర్‌లో ప్రత్యేక అర
- 400 కిలోల గంజాయి పట్టివేత

'ఉక్కు' ప్రయివేటీకరణకు కుట్రలు తీవ్రం : పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కుట్రలు నానాటికీ తీవ్రమవుతున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1035వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రతన్ టాటా గ్రూపు టెక్నికల్ టీమ్ ఇటీవల స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి వెళ్లిందని తెలిపారు. దూరప్రాంతాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ కార్యాలయాలను మూసివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రానున్న రెండు రోజుల్లో జెఎస్‌పిఎల్ టెక్నికల్ టీమ్ కూడా ప్లాంటుకు రానుందని తెలిపారు. మోడీ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. దీక్షల్లో కమిటీ చైర్మన్ ఆదినారాయణ, జె.రామకృష్ణ, శ్రీనివాసరావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, దాసరి సురేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నిండా మునిగాం...

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. 312.23 కిలోమీటర్ల మేర 57 ఆర్‌అండ్‌బి రహదారులు, 17.16 కిలోమీటర్ల మేర ఆరు పంచాయతీరాజ్ శాఖ రహదారులు దెబ్బతిన్నాయని వివరించారు. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ కేంద్ర బందానికి పంట నష్టం వివరాలను తెలియజేశారు.

షెడ్యూల్ ప్రకారం సాగని పర్యటన

కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ ప్రకారం సాగలేదు. కృష్ణా జిల్లా పామర్రు మండలం యలకుర్రు, ప్రాతూరు, గుడివాడ మండలం లింగవరంలో కేంద్ర బృందం పర్యటించాల్సి ఉంది. కానీ, ఆలస్యమై చీకటి పడిందనే కారణంతో ఆయా గ్రామాల్లో పర్యటించకుండానే వెనుతిరిగింది.

ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా పరిహారం పెంచాలి : రైతు సంఘాల సమన్వయ సమితి

తుపానుకు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, ఎం.హరిబాబు, తెలుగు రైతు రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఉమావరప్రసాద్ కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. కంకిపాడు మండలం దావులూరులో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎన్యూమరేషన్ సక్రమంగా చేయాలని విన్నవించారు. బాధితుల జాబితాలో కౌలు రైతుల పేర్లనూ చేర్చాలని కోరారు. పంట నష్టపరిహారాలు చాలా తక్కువగా ఉన్నాయని, వాటిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్ల క్రితమే భూపేంద్రసింగ్ హుడా కమిటీ ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని చేసిన సూచనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని, ఆ కమిటీ సూచన చేసినప్పటికి, ఇప్పటికీ ఉత్పత్తి ఖర్చులు రెట్టింపయ్యాయని వివరించారు. అందుకనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని కోరారు. ధాన్యం సేకరణ నిబంధనలు సడలించి దెబ్బతిన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండో పంటగా చల్లిన అపరాలు మునిగిపోయాయని, అపరాల రైతులకు విత్తనాలు అందించాలని కోరారు. దెబ్బతిన్న వాణిజ్య పంటలకూ పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్ల అభివృద్ధికి కేంద్రం గ్రాంట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బృందానికి ఎంఎల్‌ఎలు సారథి, అనిల్, పలువురు టిడిపి నేతలు కూడా వినతిపత్రాలు అందజేశారు.

అబద్ధపు ప్రచారం వద్దు

- ప్రభుత్వ ప్రకటనలో అవాస్తవాలను సరిదిద్దాలి
- ప్రిన్సిపల్ సెక్రటరీకి అంగన్‌వాడీ సంఘాల లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై ప్రభుత్వం చేసిన ప్రకటనలో అన్నీ అవాస్తవాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ సంఘాలు ఉమ్మడిగా కోరాయి. ఈ మేరకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి ఉమ్మడిగా బుధవారం స్త్రీ, శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రాన్ని మెయిల్ ద్వారా పంపి, దీన్ని మీడియాకు విడుదల చేశారు. 11, 12 తేదీల్లో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో జరిగిన అంశాలకు భిన్నంగా అవాస్తవాలతో కూడిన ప్రకటన విడుదల చేశారని, వాటిని సరిదిద్దాలని కోరారు. వైసిపి ప్రభుత్వం రాకముందు అంగన్‌వాడీలకు రూ.10,500 వేతనం ఉందని, అనంతరం 2019 జూన్ 26న వెయ్యి రూపాయలు మాత్రమే పెంచారని తెలిపారు. రూ.4,500 పెంచారని పూర్తి అబద్ధపు ప్రకటన చేశారని పేర్కొన్నారు. మినీ వర్కర్లకు రూ.6 వేలు వేతనం ఉందని, వారికీ రెండున్నర వేలు పెంచారని ప్రకటించారని, ఈ తప్పులను సరిదిద్దాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, వైఎస్ఆర్ ఆసరా, రైతుభరోసా, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అమలు చేస్తున్నట్లు ప్రకటించడం పూర్తి అవాస్తమని తెలిపారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారని పేర్కొన్నారు. ఇప్పటికైనా నవరత్నాలు పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మె విరమించకపోతే లక్షా ఆరువేల మంది అంగన్‌వాడీలను డిస్మిస్ చేస్తారని కరువుగా మాట్లాడారని, దీన్ని ప్రభుత్వ బెదిరింపుగానే పరిగణించాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం తరపున ఇలాంటి హెచ్చరికలు చేయడం సరికాదని పేర్కొన్నారు. లబ్ధిదారులకు పోషకాహారం నిలిచిపోయే ప్రమాదం ఉందని ప్రచారం చేస్తున్నారని, 7వ తేదీలోగా ప్రతినెలా ఇస్తున్నామని, ఈ నెల కావాలనే ప్రభుత్వం సరఫరా చేయడం లేదా అని ప్రశ్నించారు. అయినా తాము డిసెంబరు 8 నుండి జరగాల్సిన సమ్మెను 12వ తేదీకి వాయిదా వేసుకున్నామని గుర్తించాలని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు యాప్‌లు అమలు చేయడానికి ప్రభుత్వం ఇచ్చిందని, ఈ యాప్‌ల వల్ల విపరీతంగా పనిభారం పెరిగిందని, అవి చాలాచోట్ల పనిచేయడం లేదని, ఇబ్బందులూ పెరిగాయని అన్నారు. వాటివల్ల ఎవరికీ ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనమూ లేదని వివరించారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు రూ.రెండు లక్షలు ప్రమాద బీమా ఇస్తున్నట్లు లేఖలో రాశారని, అది వాస్తవం కాదని పేర్కొన్నారు. డిసెంబరు 11న జరిగిన చర్చల్లో ఇప్పటి నుండి అమలు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారని, గతంలో ఇచ్చినట్లు ప్రకటించడం సరికాదని అన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో తాము ఒక్కరోజు కూడా సమ్మె చేయలేదని, సామరస్యంగా పరిష్కరించాలని పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నామని వివరించారు. అనేకసార్లు నిరసనలు కూడా తెలిపామని, అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని, సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. దీన్ని జఠిలం చేయొద్దని, ఎంత త్వరగా పరిష్కరిస్తే అంత త్వరగా విధులకు హాజరవుతామని తెలిపారు. లబ్ధిదారులకు అసౌకర్యం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించొద్దని వారు కోరారు.

ఆదుకోండయ్యా..!

- వర్షాలు లేక పూర్తిగా నష్టపోయాం
- కేంద్ర కరువు బృందం ఎదుట రైతుల మొర

ప్రజాశక్తి-అనంతపురం, కర్నూలు ప్రతినిధి



కర్నూలు జిల్లా ఆదోనిలో ఎండిన టమాటా పంటను పరిశీలిస్తున్న కరువు బృందం

'వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయి పూర్తిగా నష్టపోయాం... మీరే ఆదుకోవాలి' అంటూ కేంద్ర కరువు బృందం ఎదుట రైతులు మొర పెట్టుకున్నారు. కేంద్ర కరువు బృందాలు బుధవారం శ్రీ సత్యసాయి, కర్నూలు జిల్లాల్లో పర్యటించాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటించి, పరిగి మండలం మోద గ్రామంలో రైతులతో కరువు బృందం ముఖాముఖి నిర్వహించింది. అశ్వర్థమ్మ అనే మొక్కజొన్న రైతు పొలాన్ని పరిశీలించింది. మూడు ఎకరాల్లో రూ.75 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే వర్షాలు లేక పూర్తిగా పంట ఎండిపోయిందని ఆమె కరువు బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని పంటనష్టానికి పరిహారంతో పాటు, నిత్యం కరువు ప్రాంతమైన ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. అనంతరం పుట్లగుర్లపల్లి, మడకశిర మండలంలోని బుల్లసముద్రం,గుడిబండ మండలంలోని జంబులబండ గ్రామంలో బృందం పర్యటించింది. పంట నష్టానికి సంబంధించి రూ.63.29 కోట్లు నిధులు అవసరమవుతాయని కేంద్ర కరువు బృందానికి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ వివరించారు. గురువారం చిత్తూరు జిల్లాలో కరువు బృందం పర్యటించనుంది.

కర్నూలు జిల్లాల్లో పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఆలూరు, దేవనకొండ, కోడుమూరు మండలాల్లో కరువు బందం పర్యటన సాగింది. నీతి ఆయోగ్ సీనియర్ రీసర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నా, జలశక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుధ్య విభాగం అసిస్టెంట్ అడ్వైజర్ సంతోష్, డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రటరీ సంగీత్ కుమార్ ఆధ్వర్యంలో తొలుత పత్తికొండ మండలం చిన్నహుల్తి, జూటూరు గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి, ఉల్లి, టమాటా, ఆముదం పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పరి మండలం బిల్లేకల్లు, ఆదోని మండలం విరుపపురం, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పత్తి, కంది, ఉల్లి, టమాటా పంటలను పరిశీలించారు. అనంతరం కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకుని ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గురువారం నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు.

ఎపి రైతు సంఘం వినతి

కర్నూలు జిల్లాలో పర్యటించిన కేంద్ర కరువు బృందానికి ఎపి రైతు సంఘం వినతిపత్రం అందజేసింది. పంటల నష్టాన్ని బట్టి ఎకరానికి రూ.25వేల నుంచి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందిచిన వారిలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి ఉన్నారు.

రాష్ట్రంలో ఎన్నడూలేనంతగా అశాంతి, హింస

- చంద్రబాబు విమర్శలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనను ఇబ్బంది పెట్టేందుకు, పార్టీ నేతలను భయపెట్టేందుకు ప్రజలు, కార్యకర్తలపై వైసిపి ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. కుప్పం నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం వల్ల గతంలో ఎన్నడూ లేనంతగా అశాంతి, హింస, రాజకీయ వేధింపులు తలెత్తాయని అన్నారు. మూడు నెలల తరువాత మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు కుప్పం నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో బుధవారం కాసేపు చర్చించారు. సెప్టెంబరు ఒకటిన చంద్రబాబు చివరిగా పార్టీ కార్యాలయానికి వచ్చారు. అనంతరం జిల్లాల పర్యటనలో ఉన్న ఆయనను సెప్టెంబరు 9న పోలీసులు కర్నూలులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బెయిల్‌పై వచ్చిన తరువాత బుధవారం మొదటిసారి పార్టీ కార్యాలయానికి వచ్చారు. 35 ఏళ్లుగా కుప్పం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నా ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని చంద్రబాబు అన్నారు. తన అక్రమ అరెస్టు సమయంలో మద్దతుగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా అదరక, బెదరక నిలబడ్డారని, వారిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. అక్రమ అరెస్టుపై నిరసన కార్యక్రమాలకు దిగిన తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని చంద్రబాబుతో నేతలు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో లక్షల మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలు కుమ్మక్కయితే ప్రజాస్వామ్యానికి ముప్పు

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

కార్యనిర్వహక వ్యవస్థ, శాసన వ్యవస్థతో కుమ్మక్కవడం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేస్తాయని, రాజ్యాంగం నిర్దేశించిన మార్గంలో కార్యనిర్వహక, శాసన, న్యాయవ్యవస్థలు వేటికవే స్వతంత్రంగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోగలమని వక్తలు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసి సహాయ కార్యదర్శి వి లక్ష్మణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ డిజిపి ఎంవి భాస్కర్‌రావు మాట్లాడారు. ఇటీవల కాలంలో రాజకీయనాయకులు వ్యవస్థలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం ఎక్కువ అయ్యిందన్నారు. అధికార పార్టీ నాయకులకు తమ రాజకీయ ఆధిపత్యాన్ని సాధించుకునేందుకు పోలీసు వ్యవస్థను సాధనంగా మలచుకోవడం ప్రమాదకరమని అన్నారు. వేతనం తీసుకొని కార్యనిర్వహణ వ్యవస్థలో పనిచేసేవారు తమ విధులను ఖచ్చితత్వంతో పాటించాల్సిన అవసరం వుందన్నారు. బ్రిటీష్ కాలంలో స్వాతంత్ర్యపోరాటంలో ఎక్కువ మంది న్యాయవాదులే ముందుండి నడిపించారని అదే స్ఫూర్తితో ఇపుడు కూడా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు న్యాయవాదులు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా సిఎఫ్‌డి కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేస్తే కొందరిలో అసహనం కనిపిస్తోందన్నారు. నిరసన తెలియజేయకపోతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరవధికంగా సెక్షన్ 30, 144 సెక్షన్‌లు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పోలీసు కేసులపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ స్వతంత్రంగా పనిచేసేలా మాజీ డిజిపి ఎంవి భాస్కరరావు, మాజీ ఎఏజి ఎ సత్యప్రసాద్, హిందూ పూర్వ రెసిడెంట్ ఎడిటర్ కె వెంకటేశ్వర్లుతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఒంటెత్తు పోకడలతో పోతోందని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడానని తనకు 160 నోటీస్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పై వాడికి బానిస, కిందవాడికి పెత్తందారుగా పనిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పౌరహక్కుల ఉల్లంఘనలపై ప్రజలు మానవహక్కుల కమిషన్‌కు, రాష్ట్ర హైకోర్టు జడ్జికి ఫిర్యాదులు చేయాలని, ఇలా చేయడం ద్వారా వారిపై ఒత్తిడికూడా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర నాయకులు, హై కోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యధేచ్ఛగా మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని అన్నారు. టీచర్లు, సామాన్యులు, చివరకు మాజీ మంత్రులు నిరసనలకు వస్తున్నారంటే హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నారని అన్నారు. నోటీసులు ఇవ్వకుండా అరెస్టులు చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. ప్రభుత్వమే రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య నాయకులు అక్కినేని వనజ మాట్లాడుతూ ఇటీవల పోలీసులు ఎక్కడా నిబంధనలను పాటించడం లేదని అన్నారు. ఢిల్లీలో ప్రబీర్ పురకాయస్థ, రాష్ట్రంలో మాజీ సిఎం చంద్రబాబు నాయుడి అరెస్ట్ వ్యవహారంలో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని అన్నారు. ఈ సందర్భంగా పిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టబద్ధపాలన ఎక్కడా లేదని విమర్శించారు. పులివెందులలో సిఎం ప్రత్యర్థి అని బిటెక్ రవిని పోలీసులు కస్టడీలోకి తీసుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం ప్రమాదకరమని అన్నారు. ఈ హిందూ మాజీ రెసిడెంట్ ఎడిటర్ వెంకటేశ్వర్లు, మాజి ఎఏజి సత్యప్రసాద్, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి

- కొద్దిపోస్టులకే నోటిఫికేషన్ సరికాదు
- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ ప్రకటించి, నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఐదేళ్లుగా ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, గ్రూప్-1, 2 ఉద్యోగార్థుల్లో కొద్దిమంది వయసు మీరిపోయిన వారూ ఉన్నారని పేర్కొన్నారు. వేలాది పోస్టులు ఖాళీలున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7న గ్రూపు-2లో 897 పోస్టులకు, 8న గ్రూప్-1లో 81 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో లక్షలాది మంది నిరుద్యోగులు నిరాశ చెందారని వివరించారు. మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని ఊరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు ప్రకటించలేదని, రాష్ట్రంలో 18 వేల టీచర్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 40 వేలు ఖాళీలున్నాయని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం 12 వేల మంది రిటైర్డు అవుతారని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు నింపుతామని, మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని, గిరిజన యువతకు ప్రత్యేక డిఎస్‌సి వేస్తామని ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేరలేదని పేర్కొన్నారు. ఏజెన్సీ భాషా వలంటీర్లు నాలుగున్నర సంవత్సరాలుగా పనిచేస్తున్నా వారిని రెగ్యులరైజ్ చేయలేదని తెలిపారు. వేలాది పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం 411 ఎస్‌ఐ, 6,100 కానిస్టేబుల్ పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 జాబ్ కేలెండర్ ప్రకటించాలని, ఫిబ్రవరి నాటికి పోస్టులన్నీ భర్తీ అయ్యేట్లు టైమ్‌టేబుల్ ప్రకటించి భర్తీ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రూపు -1, 2 పోస్టులను ప్రకటించి, ఫిబ్రవరిలోగా భర్తీ చేయాలని, వయోపరిమితి అర్హతను 47 ఏళ్లకు పెంచాలని కోరారు. మెగా డిఎస్‌సి ప్రకటించి ఖాళీలున్న టీచర్ పోస్టులన్నీ భర్తీ చేయాలని, గిరిజన యువతకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని ఏజెన్సీ భాషా వలంటీర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. అలాగే 2024 పూర్తిస్థాయి జాబ్ కేలండరు ప్రకటించాలని లేఖలో కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ స్టడీసర్కిల్స్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



మున్సిపాల్ వర్కర్స్‌కు సంఘీభావం తెలుపుతున్న ఎవి నాగేశ్వరరావు

రెగ్యులరైజ్ చేయండి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్
- మూడోరోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపల్ ప్రాంతాల్లో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు విజయవాడలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు దీక్షలను ప్రారంభిస్తూ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడారు. అమృత్ పట్టణాలు, స్మార్ట్ సిటీలు, స్వచ్ఛభారత్ వంటి నినాదాల చాటున కార్మికులతో ప్రభుత్వాలు వెట్టిచాకరి చేయించుకుంటున్నాయని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను కేబినెట్‌లో అజెండాగా పెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, కె ధనలక్ష్మి, భవన నిర్మాణ సంఘం నాయకులు నరసింహారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కె శ్రీనివాసరావు, టి గోపి, దుర్గారావు, భాగ్యం పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కక్ష కట్టిన జగన్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కక్ష కట్టారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. డిమాండ్లు నెరవేర్చకపోగా, నిరసనలు చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం జగన్ అధికార మదానికి నిదర్శనమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జీతం పెంచకపోగా ఆదాయ పరిమితి అస్త్రంతో అంగన్‌వాడీల సంక్షేమంలో కోత పెట్టారని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్నవారిపై పోలీసులతో లాఠీ చార్జ్ చేయిస్తున్నారని, ప్రశ్నిస్తే మెమో ఇచ్చి బెదిరిస్తున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చి, సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ సమ్మెకు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తోందని టిడిపి నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు.

క్షేత్రస్థాయిలో విద్యా వ్యవస్థ అభివృద్ధి

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా వ్యవస్థను క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేయడానికి అధికారులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్షా చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో జిల్లా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, లోపాలు ఉన్నచోట వెంటనే సరిదిద్దాలని చెప్పారు. కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావుతో కలిసి విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్లు, ప్రాంతీయ, జిల్లా అధికారులతో బుధవారం సమగ్ర శిక్షా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సాల్ట్ ప్రాజెక్టు, స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నాయకత్వ శిక్షణలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అందరితో 'నిపుణ్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు.

సమ్మె ఉధృతం



కర్నూలు ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అంగన్‌వాడీల అధ్యక్షులు బి.రేణుకమ్మ



విజయవాడ ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించకుండా దౌర్జన్యాలు, బెదిరింపులు, ఒత్తిడులతో సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకుంటే సిఐటియు చూస్తూ ఊరుకోదని, అన్ని సంఘాలనూ కలుపుకొని విశాల ఐక్యత ద్వారా సమ్మెను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాలుగున అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు.

మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు తీర్పును శిరసావహించి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ మూడు మాసాల నుంచి వివిధ రూపాల్లో ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నా సమస్యల పరిష్కారానికి ముందుకు రానందునే అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందన్నారు.

శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ తక్షణమే సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో అంగన్‌వాడీల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. గుంటూరు కలెక్టరేట్ సమ్మె శిబిరంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకూ సమ్మె కొనసాగుతుందని తేల్చి చెప్పారు. పెదకాకాని, మంగళగిరిలో శిబిరాలను కూడా ఆమె సందర్శించి మద్దతు తెలిపారు.

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సిందిపోయి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం వంటి చర్యలకు పూనుకోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శమని విమర్శించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం సమ్మె శిబిరంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా అధికారులతో బెదిరింపులకు దిగడం తగన్నారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరాలను రాజమహేంద్రవరంలో టిడిపి ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, పశ్చిమగోదావరి జిల్లా కాళ్లలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, విజయవాడలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, అల్లూరి జిల్లా అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర తదితరులు సందర్శించి మద్దతు పలికారు.

గ్రామీణ ఆదాయాల్లో ఒత్తిడి

- పుంజుకోని ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తుల డిమాండ్ • పేరుకుపోతున నిల్వాలు ఆందోళనలో కంపెనీలు

న్యూఢిల్లీ: గ్రామీణ ఆదాయాల్లో ఒత్తిడి నెలకొనడంతో ఇప్పటికీ ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తుల అమ్మకాల్లో డిమాండ్ కొరవడింది. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్‌కు పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతున్నప్పటికీ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా డిమాండ్ పునరుద్ధరణ జరగలేదని బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనంలో వెల్లడించింది. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన ఎఫ్‌ఎంసిజి సమ్మిట్ అనంతరం ఈ వార్తను ప్రచురించింది. డెయిరీ, కాస్మోటిక్స్, పానియాలు, బేకరీ ఉత్పత్తులు, సబ్బులు, షాంపులు తదితర ఉత్పత్తులు ఎఫ్‌ఎంసిజి విభాగంలోకి వస్తాయి. డాబర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహిత్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఎఫ్‌ఎంసిజి అమ్మకాల్లో రికవరీకి అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ.. గ్రామీణ డిమాండ్ ఇప్పటికీ పట్టణ మార్కెట్లలో వెనుకబడి ఉందని అన్నారు. పండుగల సీజన్ ఉన్నప్పటికీ నగదు లభ్యత సమస్యలు గ్రామీణ ప్రాంతాలను



వేధిస్తున్నాయని మల్హోత్రా పేర్కొన్నారు.

కోవిడ్-19 మహమ్మారి నుండి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గింది. ఈ ప్రభావాన్ని దేశంలోని అతిపెద్ద ఎఫ్‌ఎంసిజి కంపెనీ హిందుస్తాన్ యూనిలీవర్ ఎత్తి చూపింది. రబీ పంట గ్రామీణ డిమాండ్‌లో పెరుగుదలను ప్రతిబింబిస్తుందని అదానీ విల్‌మార్‌కు చెందిన అంగ్షు మల్లిక్ పేర్కొన్నారు. గ్రామీణ మార్కెట్లు రికవరీ సంకేతాలను మాత్రం చూపిస్తున్నాయని మార్కెట్ పరిశోధన సంస్థ ఎన్ఐక్యూ నివేదిక పేర్కొంది. సెప్టెంబరు త్రైమాసికంలో వినియోగం మునుపటి సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉందని తెలిపింది. డిమాండ్ లేమీతో ఈ ఏడాది నవంబర్ చివరి నాటికి ఎఫ్‌ఎంసిజి కంపెనీల వద్ద, పంపిణీదారుల వద్ద సరుకుల నిల్వలు పెరిగాయని సమాచారం. దేశంలో చోటు చేసుకుంటున్న అధిక ధరలకు తోడు విద్యా, వైద్యం వ్యయాలు పెరిగిపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. మరోవైపు ఆదాయాలు పెరగక పోవడంతో అనేక రంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపైన ప్రతికూల ప్రభావం చూపనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆల్‌టైం కనిష్టానికి రూపాయి

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో భారత రూపాయి విలువ వెలవెల పోతోంది. బుధ వారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 83.40కు పడపోయింది. ఇంతక్రితం సెషన్‌లో 83.38 వద్ద ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షా నేపథ్యంలో రూపాయి విలువ తగ్గిందని ఫారెక్స్ నిపుణులు పేర్కొన్నారు. ఇంతక్రితం నవంబర్ 10న రూపాయి విలువ 83.42 కనిష్ట స్థాయిని తాకింది. డిసెంబర్‌లో మరింత తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. రూపాయి విలువ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1.5 శాతం పతనాన్ని చవి చూసింది. గడిచిన నవంబర్‌లో 0.2 శాతం విలువ తగ్గింది.

జగన్‌పై దాడి కేసులో నిందితుడికి బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా జరిగిన కత్తి దాడి కేసు నిందితుడు శ్రీనివాసరావుపై హత్యాయత్నం (ఐపిసి 307) సెక్షన్ కింద కేసు నమోదు చేయడాన్ని ఆయన తరపున సీనియర్ అడ్వకేట్ త్రిదీప్ పైస్ ఆన్‌లైన్ ద్వారా హైకోర్టులో వాదించారు. ప్రస్తుతం సిఎంగా ఉన్న జగన్‌కు అప్పుడు స్వల్ప గాయమే అయ్యిందని, దాడి తర్వాత విమానంలో హైదరాబాద్ కూడా వెళ్లిపోయారని చెప్పారు. ఈ కేసులో 55 మంది సాక్షులు ఉంటే ఇప్పటికి ఒకే ఒక్క సాక్ష్యాన్ని నమోదు చేశారన్నారు. తీవ్ర కాలయాపన చేస్తున్నారని, నేటికీ జైలులోనే పిటిషనర్ ఉన్నారని చెప్పారు. విశాఖలోని ఎన్ఐఎ కోర్టు బెయిలు మంజూరుకు నిరాకరిస్తూ గత సెప్టెంబరు 22న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ ఎం కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. విచారణను ఈ నెల 20కు వాయిదా వేసింది.

23 నుంచి నందినాటకోత్సవాల తుది పోటీలు

- సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాటకరంగం అభివృద్ధికి పేద, మధ్య తరగతి కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తోన్న నంది నాటకోత్సవాల తుది ప్రదర్శన పోటీలను ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, రాష్ట్ర చలన చిత్ర టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నంది నాటకోత్సవాల ప్రిలిమనరీ ప్రదర్శనలు సెప్టెంబరు 6 నుంచి 18 వరకు జరిగాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన 115 ఎంట్రీలను ఆయా ప్రాంతాల్లోనే న్యాయనిర్ణేతలు ప్రదర్శనలను తిలకించారని, వాటిల్లో 38 ప్రదర్శనలను తుది పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, బాలల నాటికలు, కళాశాల లేదా యూనివర్సిటీ నాటిక (ప్లేలెట్స్)లు అనే ఐదు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రదర్శనలకు సంబంధించి వివిధ విభాగాల్లో, కేటగిరిలో 74 అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం, వైఎస్‌ఆర్ రంగస్థల పురస్కారం కూడా అందిస్తామని తెలిపారు. కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సమాచార శాఖ రిటైర్డ్ జాయింట్ డైరక్టర్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

'పుష్ప' తరహాలో గంజాయి సరఫరా


- కంటైనర్‌లో ప్రత్యేక అర
- 400 కిలోల గంజాయి పట్టివేత



కంటైనర్ నుంచి గంజాయి బస్తాలను బయటకు తీస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

పుష్ప సినిమాలో ఎర్రచందనం దుంగలను పాల ట్యాంక్‌లో స్మగ్లింగ్ చేసిన తరహాలో గంజాయిని కంటైనర్‌లో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. కంటైనర్ క్యాబిన్ పైభాగం వెనుక ఓ డోర్‌ను అమర్చుకుని అందులో సుమారు 400 కేజీల గంజాయిని తరలిస్తుండగా నిందితులను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... విశాఖపట్నం నుంచి బెంగళూరుకు గంజాయి బస్తాలతో కంటైనర్ వాహనం బయల్దేరింది. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం ఉదయం ఈ కంటైనర్‌ను శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు 44వ జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేశారు. కంటైనర్‌కు వెనుక ఓ ప్రత్యేక తలుపును ఏర్పాటు చేసుకుని అందులో గంజాయి బస్తాలను ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 400 కిలోల గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు డిఎస్‌పి కంజక్షన్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ. కోటిన్నర ఉంటుందని తెలిపారు. బెంగళూరులో నూతన సంవత్సర వేడుకలు జరగనున్న నేపథ్యంలో వీటిని అక్కడికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

శ్రీసిటి ఎమ్‌డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సిఎం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతిలోని తాజ్‌హోటల్ నందు జరిగిన శ్రీసిటి ఎమ్‌డి రవిసన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు బుధవారం సాయంత్రం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధువు నిరీష, వరుడు సాగర్‌లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రోజా, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, అధికారులు సాదర స్వాగతం, వీడ్కోలు పలికారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

సాయం కోసం తుపాను బాధితుల ధర్నా

ప్రజాశక్తి -నెల్లూరు

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో తుపాన్ ప్రభావంతో నష్టపోయిన తమకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ బాధితులు ధర్నా చేశారు. తొలుత సిపిఎం ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తుపాను కారణంగా అనేక ప్రాంతాలు జలమయమయ్యా యని అన్నారు. ఇళ్లలోని వరద నీరు చేసి వస్తువులు, బట్టలు, ఆహార సరుకులు తడిచిపోయాయని, నిరాశ్రయులుగా సహాయక శిబిరాల్లో తలదాచుకు న్నారని తెలిపారు. బాధితుల్లో కొంతమందికి రూ.2500 ఇచ్చి అదే సహాయంగా చెబుతున్నార న్నారు. బాధితులందరికీ 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు తక్షణమే అందించాలని, నీట మునిగిన ఇళ్లకు రూ.ఐదు వేలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ. పదివేలు, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పి సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

- వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డికె.యాదవ్
- సిటిఆర్ఐ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పొగాకు సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించాలని వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డికె.యాదవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సిటిఆర్ఐ) ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ ఉత్సవాలను డికె.యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. పొగాకు నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు ప్రోత్సహించాలని, పొగాకులో క్యాన్సర్ కారకాలను తగ్గించడానికి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని సూచించారు. రైతులకు అధిక ఆదాయం లభించేందుకు మిరప, పసుపు, అశ్వగంధ, ఆముదం వంటి పంటలపైనా పరిశోధన చేసేందుకు సిటిఆర్ఐకు నిర్దేశించామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలతోపాటూ మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ



ఉత్సవాలను ప్రారంభిస్తున్న యాదవ్, ఎమ్మెల్యే గోరంట్ల

చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను రూపొందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపి మార్గాని భరత్‌రామ్, పొగాకు బోర్డు చైర్మన్ యస్వంత్ కుమార్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నన్నయ యూనివర్సిటీ విసి కె.పద్మరాజు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. 75 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానానికి చిహ్నంగా నిర్మించిన ప్రత్యేక పైలాన్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఆదర్శ రైతులను సత్కరించారు. కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మార్గదర్శిపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అక్రమాల వ్యవహారంపై సిఐడి దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపు, తప్పుడు రికార్డులు తదితర అభియోగాలపై రామోజీరావు, చెరుకూరి శైలజా కిరణ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన వారిపై నమోదైన కేసులో సిఐడి వేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేసింది. దీనిని సవాల్ చేస్తూ సిఐడి దాఖలు చేసిన అప్పీళ్లను బుధవారం జస్టిస్ కె సురేష్‌రెడ్డి విచారించారు. కౌంటర్ దాఖలు చేయాలని రామోజీరావు, శైలజా కిరణ్ ఇతరులను ఆదేశించారు. అప్పీళ్లకు విచారణ అర్హత లేదనే అంశంపై తాము వాదిస్తామని రామోజీ, ఇతరుల తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ అన్నారు.

కాంట్రాక్ట్ సేద్యంలోకి ఫ్రాంక్లిన్

న్యూఢిల్లీ : వ్యవసాయ వస్తువుల వ్యాపారంలో ఉన్న ఫ్రాంక్లిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొత్తగా కాంట్రాక్ట్ వ్యవసాయంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రటించింది. తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ గుజరాత్ కంపెనీ పేర్కొంది. తమ వ్యూహాత్మక విస్తరణ మార్కెట్ స్థితిని బలోపేతం చేయడమే కాకుండా వృద్ధి, లాభదాయకత కోసం కొత్త మార్గాలను సృష్టించనున్నట్లు వెల్లడించింది.

తిరుపతి కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వొద్దు

- టిటిడికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల వెంకటేశ్వరస్వామి వారికి యాత్రికులు ఇచ్చే కానుకలతో తిరుపతి రోడ్ల నిర్మాణాలు, పారిశుధ్య పనులు చేయడం సరికాదని, నిధులను విడుదల చేయరాదని తిరుమల తిరుపతి దేవస్థానాలకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టెండర్ ప్రక్రియను కొనసాగించుకోవచ్చునని చెప్పింది. అయితే, కాంట్రాక్టును ఎరికీ కేటాయించొద్దని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. తిరుపతిలో రోడ్ల నిర్మాణానికి, పారిశుధ్య పనులకు టిటిడి నిధులను వెచ్చించాలనే టిటిడి నిర్ణయాన్ని ప్రాథమికంగా తప్పుపట్టింది. తిరుపతిలో రోడ్లు, పారిశుధ్య పనుల కోసం టిటిడి నిధులు రూ.100 కోట్లు వెచ్చించాలని పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జి భాను ప్రకాష్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. దీనిపై టిటిడి తరపున సీనియర్ అడ్వకేట్ చిత్తరవు రఘు స్పందిస్తూ, తిరుపతిలో టిటిడి నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, పలు సంస్థలు ఉన్నాయన్నారు. రోడ్లు, పారిశుధ్య పనులు కూడా యాత్రికుల సౌకర్యార్థం కోసమేనన్నారు. వాదనల తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని టిటిడి ఇఒ, తిరుపతి మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.



బిసిలతో మాట్లాడుతున్న నారా లోకేష్

బిసిల రక్షణకు ప్రత్యేక చట్టం

- వంద రోజుల్లో జిఒ 217 రద్దు
- ఉపాధి లేని రోజుల్లో కల్లుగీత కార్మికులకు సాయం : లోకేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎస్.రాయవరం విలేకరి

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిసిల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరులో లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో సాగింది. పాదయాత్రలో భాగంగా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద బిసిలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామాషా ప్రకారం బిసి ఉప కులాలకు నిధులు కేటాయించి, కార్పొరేషన్లను బలోపేతం చేసే బాధ్యత తీసుకుం టామన్నారు. జగన్ ప్రభుత్వం తగ్గించిన పది శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులకు బోట్లు, వలలు, డీజిల్, టూ వీలర్, ఐస్ బాక్సులను సబ్సిడీపై అందిస్తామని తెలిపారు. గొర్రెల పెంపకందారులకు సబ్సిడీపై గొర్రెలు ఇవ్వడంతోపాటు మేత, మందులు అందిస్తామని చెప్పారు. కల్లుగీత కార్మికుల వృత్తి రక్షణకు ప్రభుత్వ బంజరు భూముల్లో చెట్ల పెంపకం కోసం ఉపాధి హామీ నిధులతో అనుసంధానం చేస్తామన్నారు. పని లేని సమయం లో కల్లుగీత కార్మికులకు సాయం అందించే విషయం ఆలోచిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 217 జిఒ రద్దుచేసి చేపల చెరువులను మత్స్యకారులకు అప్పగిస్తామన్నారు. ఎన్ఎబి సమస్యపై నేవీ అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపిస్తా మని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రంగానికి పాత విధానంలో తక్కువ ధరకు విద్యుత్, సబ్సిడీలు అందిస్తామన్నారు. బిసిలపై పెట్టిన అక్రమ కేసుల న్నింటినీ ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మళ్లీ నిరాశే..!


ధనిక దేశాలను నియంత్రించడంలో ఐక్యరాజ్యసమితి విఫలమవుతున్న తీరుకు వాతావరణ సదస్సు-కాప్ 28 ముగిసిన తీరే తాజా నిదర్శనం. గత నెల 30వ తేదీన దుబాయ్‌లో ప్రారంభమైన ఈ సదస్సు అధికారికంగా 12వ తేదీనే ముగియాల్సి ఉన్నప్పటికీ, బుధవారం నాడు కూడా కొనసాగింది. అయినా, వాతావరణ మార్పుల ప్రభావాన్నుండి భూగోళాన్ని, మానవాళిని కాపాడేందుకు తీసుకున్న చర్యలు నామమాత్రమే! ఆచరణాత్మక దిశలో అడుగు ముందుకు వేయడానికి బదులుగా ధనిక దేశాలు వాగాడంబరానికి, తమ ఎజెండాను పేద దేశాలపై రుద్దడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చాయి. ఈ కారణంగానే సదస్సు ముగిసిన తరువాత అనేక పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేశాయి. ప్రతిష్టాత్మక లక్ష్యాలను సంకల్పించే ముందు క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేసే పరిస్థితులు ఉండాలని, ఈక్విటీ, క్లైమేట్ జస్టిస్‌లపై ఆధారపడి ముందుకు సాగాలని భారత్ వ్యాఖ్యానించింది. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు వ్యక్తం చేసిన అనేక ఆందోళనలను కాప్ 28 పరిగణలోకి తీసుకోలేదని చైనా విమర్శించింది. పేద దేశాలకు సుద్దులు చెప్పే ముందు ఇతర దేశాల కన్నా ముందుగా ధనిక దేశాలు ప్యారిస్ ఒప్పంద లక్ష్యాలను సాధించేందుకు అడుగు ముందుకు వేయాలని కోరింది. నూతన వలస విధానానికి తాము మరోసారి బాధితులమవుతున్నామని బొలీవియా పేర్కొంది. ధనిక దేశాలు కార్బన్ వలస వాదాన్ని అమలు చేస్తున్నాయని, తమ వంటి దేశాలకు అభివృద్ధి చెందే హక్కును నిరాకరిస్తున్నాయని విమర్శించింది. దాదాపుగా అన్ని పేద దేశాలు ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం దేనికి ప్రతిబింబమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకునే నష్టాలను పూడ్చేందుకు నిధిని ఏర్పాటు చేయాలన్న గత సమావేశ ప్రతిపాదనను తొలిరోజే ఆమోదించడంతో వ్యక్తమైన సానుకూల సంకేతాలు ఆ తరువాత ఆవిరైనాయి. దాదాపు 700 మిలియన్ డాలర్లతో ఏర్పాటైన ఈ నిధితోనే గతంలో తాము చేసిన తప్పులన్నీ మాఫీ అయినట్లుగా అమెరికా నేతృత్వంలోని ధనిక దేశాల ప్రతినిధులు ఉపన్యాసాలు చేయడం, పేద దేశాలకు సుద్దులు చెప్పడానికి సిద్ధమైపోవడం దుర్మార్గం. ఈ క్రమంలోనే ప్యారిస్ ఒప్పంద పురోగతిలో భాగస్వామ్య (గ్లోబల్ స్టాక్‌టేక్) లక్ష్యాల్లో భాగంగా శిలాజ ఇంధనాల వినియోగాన్ని, ముఖ్యంగా బొగ్గు వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలంటూ ధనిక దేశాలు చేసిన ప్రతిపాదన సమావేశంలో గగ్గోలు రేపింది. బొగ్గుతో పాటు అన్ని రకాల శిలాజ ఇంధనాల వినియోగాన్ని 2050 నాటికి సున్నా స్థాయికి తీసుకురావాలన్న ఆ దేశాల ప్రతిపాదనను చైనా, భారత్‌లతో పాటు అన్ని అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు (బేసిక్, ఎల్‌ఎండి దేశాలు) వ్యతిరేకించాయి. దీంతో ఈ ప్రతిపాదనలో వాడిన భాషను కొంత మేర సవరించక తప్పని స్థితి ఏర్పడింది. దీనికే ధనిక దేశాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. అదే సమయంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వ్యవస్థకు మారడానికి తమకు సాంకేతిక సాయంతోపాటు, ప్రత్యేకంగా ఆర్థిక సాయాన్ని అందించాలంటూ పేద దేశాలు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించడం రెండు నాల్కల ధోరణికి నిదర్శనం.

అనేక ఇతర అంశాలపై కూడా ధనిక దేశాలు ఇదే విధంగా వ్యవహరించడంతో కాప్-28 వాతావరణ లక్ష్యాల సాధనకు దూరంగానే మిగిలిపోయింది. సమావేశాల ముగింపు కార్యక్రమంలో విడుదల చేసిన ప్రపంచ లక్ష్యాలు (గ్లోబల్ గోల్ ఆన్ ఆడాప్టేషన్-జిజిఎ)పైనా సంపన్న దేశాల పట్టే కనిపించింది. కొన్ని దశాబ్దాలుగా చర్చనీయాంశంగా ఉన్న 'సాధారణం కానీ విభిన్న బాధ్యతలు, సంబంధిత సామర్థ్యాల సూత్రం ఈసారి కూడా జిజిఎలో చోటుచేసుకోలేదు. వాతావరణ ప్రమాద అంచనాలు రూపొందించడం, నివారణకు ప్రణాళికలు తయారు చేయడం, అమలు చేయడం వంటి అంశాలు ఇప్పటికీ అస్పష్టంగానే ఉన్నాయి. ఆర్థిక సాయం కోసం ధనిక దేశాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడటం కాకుండా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలన్న ఆఫ్రికన్ దేశాల విజ్ఞప్తినీ పరిగణలోకి తీసుకోలేదు. అయితే, ఆ సమావేశానికి కూత వేటు దూరంలో సమావేశమైన వేలాదిమంది ప్రజానీకం భూగోళానికి దాపురించిన ముప్పునకు ధనిక దేశాలదే బాధ్యతని, అమెరికాతో పాటు ఇతర అభివృద్ధి చెందిన దేశాలు దీనికి బాధ్యత వహించాలని పెద్ద ఎత్తున నినదించడం భవిష్యత్తు పట్ల ఆశలను పెంచుతోంది.

మహనీయుల మాట

నేడు ఎం.బి జయంతి




రాజ్యసభ సభ్యునిగా, సిపిఎం అగ్ర నేతగా మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడిన... తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవపున్నయ్య జయంతి నేడు.

జననం : 14.12.1914
మరణం : 12.4.1992

అంగన్‌వాడీలపై బెదిరింపులు మానండి

విశ్లేషణ



సిహెచ్. నరసింగరావు

డిసెంబర్ 12 నుంచి రాష్ట్రంలోని 1,03,000 మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు నూరు శాతం 55,605 సెంటర్లలో, 257 ప్రాజెక్టులలో సమ్మె చేస్తున్నారు. ఇది ఐక్య పోరాటం. అన్ని యూనియన్లు కలసి ఐక్యంగానూ, సమరశీలంగానూ ఈ పోరాటం చేస్తున్నాయి. గత నాలుగున్నర సంవత్సరాల జగన్ మోహన్ రెడ్డి పాలనలో అంగన్‌వాడీలు ప్రత్యక్షంగా నిరవధిక సమ్మెకు దిగడం ఇదే మొదటిసారి. గత నాలుగు సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వానికి పదే పదే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అనేక విజ్ఞప్తులు చేసింది. గత ఆరు మాసాల నుండి 2023 మార్చి 20 చలో విజయవాడ, జులై 10, 11 కోర్కెల దినం, సెప్టెంబర్‌లో మరలా చలో విజయవాడలు నిర్వహించాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా పట్టించుకోలేదు. సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పరుగులు తీస్తున్నది. లబ్ధిదారులకు ప్రతి నెలా 7వ తేదీలోగా పోషక పదార్థాలు పంపిణీ అవుతాయి. అనంతరం డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి 20 రోజులకు ముందే మూడు యూనియన్లు ఐక్యంగా నోటీసు ఇచ్చాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోయింది. డిసెంబర్ 6న చర్చలకు పిలిచి ఈ నెల పౌష్టికాహారం సప్లయ్ చేయలేకపోయామని లబ్ధిదారుల శ్రేయస్సు దృష్ట్యా డిసెంబర్ 11వ తేదీ వరకూ వాయిదా వేయమని కోరారు. ఆ రోజే డిసెంబర్ 12 నుండి సమ్మె చేస్తామని ముందే అధికారులకు యూనియన్ నాయకత్వాలు స్పష్టం చేశాయి. డిసెంబర్ 11న చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి యూనియన్ సిఐటియు నాయకులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఏఐటియుసి నాయకులు లలితమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు భారతితో చర్చలు జరిపారు. ప్రధానమైన వేతన పెంపు, గ్రాట్యూటీ చేయలేమని చెప్పారు. సమ్మెను విరమించమని కోరారు. దీన్ని ట్రేడ్ యూనియన్లు పూర్తిగా తిరస్కరించాయి. డిసెంబర్ 12 నుండి నిరవధిక సమ్మె సాగుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు సమస్యల పరిష్కారం చేతకాక అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. డిసెంబర్ 12వ తేదీన రాష్ట్ర అధికారులు సమ్మె కొనసాగిస్తే ఉద్యోగం నుండి తొలగిస్తామని చర్చల్లో బెదిరించారు. డిసెంబర్ 13న జిల్లా కలెక్టర్లు కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారు. జంగారెడ్డి గూడెంలో ఒకటి, మండవల్లిలో మూడు సెంటర్లకు, ఏలూరు జిల్లాలోనూ తాళాలు పగలగొట్టారు. మన్యం జిల్లాలో సాలూరులో మూడు సెంటర్లకు అధికారులు తాళాలు పగలగొట్టారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాలను నడపాలని ఇతర శాఖలకు బాధ్యత అప్పగించారు. 'ఈ బెదిరింపులతో మన ఉద్యమం ఆగదు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు మాని తక్షణం సమస్యలు పరిష్కరించాల'ని సిఐటియు డిమాండ్ చేస్తున్నది.



ఏ విధంగా చూసినా అంగన్‌వాడీలు కార్మికులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయక పోవడం కోర్టు తీర్పును ధిక్కరించడమే. అంగన్‌వాడీలను కార్మికులు అని గుర్తిస్తే గ్రాట్యూటీ, పి.ఎఫ్, ఇఎస్ఐ, బోనస్, పెన్షన్ తదితర చట్టపరమైన హక్కులన్నీ అమలు చేయాలి. వీటికి ఎగనామం పెట్టడానికి కార్మికులుగా గుర్తించకుండా దొడ్డిదారిన కొన్ని సౌకర్యాలు మాత్రమే కల్పిస్తామని చర్చల్లో అధికారులు చెప్పారు. గ్రాట్యూటీ చెల్లించకుండా రిటైర్మెంట్ బెనిఫిట్‌గా వర్కర్‌కు లక్ష రూపాయలు, హెల్పర్‌కు రూ. నలభై వేలు చెల్లిస్తామంటున్నారు. అంగన్‌వాడీలకు దయాదాక్షిణ్యంగా చెల్లించనక్కర్లేదు. 30 సంవత్సరాలు సర్వీసు చేసిన వారికి ప్రస్తుత జీతం ప్రకారమే సుమారు రూ. 2 లక్షలు చెల్లించాలి. చట్టాల్ని అమలు చేయాలని, చట్టాల్ని ధిక్కరించొద్దని సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నది.

సమ్మె ఎందుకు?

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడా ఐసిడిఎస్ సేవలు అందుతున్నాయి. వెనకబడిన ప్రాంతాలు, మురికివాడలు, గిరిజన ప్రాంతాలకు ఈ సేవలు చాలా ముఖ్యమైనవి. ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు పౌష్టికాహారం, చదువు అందిస్తున్నారు. బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. మానవ అభివృద్ధి సూచికలో ఆరోగ్య అభివృద్ధిలో వీరి పాత్ర అతి ముఖ్యం. ఇటువంటి ముఖ్య సేవలు గత 30 సంవత్సరాలకు పైగా అంగన్‌వాడీలు లక్షల మంది దేశమంతా ప్రజలకు అందిస్తున్నారు. అయినా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల జీవితాలు 'గొర్రె తోక బెత్తెడు చందం'గా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులుగా పనిచేస్తున్న వీరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. రాష్ట్రంలో గత పిఆర్‌సి ప్రకారం ఆఖరు గ్రేడ్ ఉద్యోగులకు నెలకు రూ. 20 వేలు బేసిక్‌గా చెల్లిస్తున్నారు. అదే జీతాన్ని అంగన్‌వాడీ హెల్పర్‌కు చెల్లించాలి. వర్కర్‌కు ఇంకా అదనంగా చెల్లించాలి. అంగన్‌వాడీలకు ఎంత తక్కువగా జీతం పెంచినా ఉన్న జీతంమీద 20 శాతం అదనంగా ఉండాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం జీతాన్ని ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం చాలా దుర్మార్గం. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కానీ జీతాలు పాతాళానికి నెట్టివేయబడుతున్నాయి. ఈ కాలంలో కరువు భత్యం 469 పాయింట్లు పెరిగాయి. విడిఏ లెక్క ప్రకారం పాయింట్‌కు రూ. 7.74 చొప్పున పెంచాలి. దీని ప్రకారం కేవలం కరువు భత్యం నెలకు రూ. 3,630 అదనంగా పెంచాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవన్నీ చెల్లించనని మొండి వాదన చేస్తున్నది.

2022 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు అంగన్‌వాడీ కార్మికుల గురించి తీర్పునిచ్చింది. అంగన్‌వాడీలు కార్మికులా? కాదా? కార్మికులు అయితే వీరికి గ్రాట్యూటీ చెల్లించాలా? లేదా? ఈ రెండు విషయాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. ఐసిడిఎస్ ఒక ప్రభుత్వ సంస్థ. ఈ సంస్థలో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు సర్వీసు కండిషన్లు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు 15 రకాల పనులు చేయాలని స్పష్టంగా ఆ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. వారికి చెల్లించే జీతం గౌరవ వేతనం అని పేరు పెట్టినా చట్ట ప్రకారం వేతనమే అవుతుంది. ఏ విధంగా చూసినా అంగన్‌వాడీలు కార్మికులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయకపోవడం కోర్టు తీర్పును ధిక్కరించడమే. అంగన్‌వాడీలను కార్మికులు అని గుర్తిస్తే గ్రాట్యూటీ, పి.ఎఫ్, ఇఎస్ఐ, బోనస్, పెన్షన్ తదితర చట్టపరమైన హక్కులన్నీ అమలు చేయాలి. వీటికి ఎగనామం పెట్టడానికి కార్మికులుగా గుర్తించకుండా దొడ్డిదారిన కొన్ని సౌకర్యాలు మాత్రమే కల్పిస్తామని చర్చల్లో అధికారులు చెప్పారు. గ్రాట్యూటీ చెల్లించకుండా రిటైర్మెంట్ బెనిఫిట్‌గా వర్కర్‌కు లక్ష రూపాయలు, హెల్పర్‌కు రూ.నలభై వేలు చెల్లిస్తామంటున్నారు. అంగన్‌వాడీలకు దయాదాక్షిణ్యంగా చెల్లించనక్కర్లేదు. 30 సంవత్సరాలు సర్వీసు చేసిన వారికి ప్రస్తుత జీతం ప్రకారమే సుమారు రూ. 2 లక్షలు చెల్లించాలి. చట్టాల్ని అమలు చేయాలని, చట్టాల్ని ధిక్కరించొద్దని సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఐసిడిఎస్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి పలు ప్రయత్నాలు చేసింది. స్వచ్ఛంద సంస్థలు అక్షయ పాత్ర, వేదాంత, జిందాల్ లాంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని అనేక రాష్ట్రాల్లో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 2019-20 బడ్జెట్‌లో ఐసిడిఎస్ కేటాయింపు రూ. 25 వేల కోట్ల నుండి రూ. 15 వేల కోట్లకు తగ్గించింది. కేంద్ర ప్రాజెక్టు అయిన ఐసిడిఎస్‌లో అంగన్‌వాడీలకు ఖర్చును 80 శాతం కేంద్ర ప్రభుత్వం, 20 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. కానీ మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తమ ఖర్చును 60 శాతానికి తగ్గించింది. అంగన్‌వాడీలకు నేటికి కూడా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న జీతం నెలకు రూ. 2,700 మాత్రమే. బిజెపి అంగన్‌వాడీలకు వ్యతిరేకమైన తప్పుడు విధానాలను పాటిస్తున్నది. కార్పొరేట్ల కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భజన చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలు బ్యాంకుల నుండి తీసుకుని చెల్లించని రూ.15.2 లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేయగలిగింది. ఇందులో ఒక్క శాతం ఐసిడిఎస్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం చెల్లించినా కార్మికుల జీతాలు రెట్టింపు చేయొచ్చు. అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా నడపవచ్చు. రాష్ట్రంలోని గంగవరం పోర్టును జగన్ ప్రభుత్వం అదానీకి అప్పగించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా అంగన్‌వాడీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. లేకుంటే ఈ పోరాటం మరింత ఉధృతం అవుతుంది. మొత్తం కార్మికుల్లో 90 శాతం అంగన్‌వాడీ కార్మికులు సిఐటియు సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వీరికి రాష్ట్ర సిఐటియు సంఘాలన్నీ సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరుతున్నాము.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

జనవాక్యం

జ్యోతిష్యంలో నిజమెంతో తెలిసిందిగా!

తెలంగాణ ఎన్నికల తేదీలు ప్రకటించిన తరువాత ఎంతో మంది జాతకాల రాయుళ్లు...ఎక్కడ వెనకబడిపోతామో అనుకొని... వారి వారి జాతక విద్యను పోటీపడి ప్రదర్శించటం మొదలు పెట్టారు. అందరూ కెసిఆర్ ముఖ్యమంత్రి ఖాయం అని చెప్పినవారే. ఒకడైతే ఆరు నూరైనా, నూరు ఆరయినా కెసిఆర్ ముఖ్యమంత్రేనని ఢంకా కొట్టి చెప్పాడు. వీరంతా భారీ సంభావనలు పుచ్చుకొని ఉంటారు. ఇందంతా అందుకోసమే కదా! మరొకడైతే కెసిఆర్ ముఖ్యమంత్రి కాకపోతే జాతకాలు చెప్పటం మానేస్తానని చెప్పాడు. చీమంత నిజాయతీ ఉన్నా ఆ పని చేస్తే జనాన్ని ఈ పిచ్చి నుండి కాపాడినవాడౌతాడు. ఇక కెసిఆర్ తను మూడోసారి ముఖ్యమంత్రి కావాలని స్వరూపానంద చేత రాజసూయ యాగం, రాజశ్యామల యాగం, చండీ యాగం, ఆ యాగం ఈ యాగం అంటూ కోట్లాది రూపాయల ప్రజాధనం తగలేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని ఈ స్వరూపానందకు ఎకరా రూపాయికే ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఆ జీవోను రద్దు పరచి ఇచ్చిన భూమిని స్వాధీనం చేసుకోవాలి. ఇక చినజియ్యరు చేత యాదాద్రి నిర్మించి వేల కోట్ల రూపాయాలను తగలేశారు. యాగఫలాలు ఎమైనాయి? ప్రజాబలం ముందు నామరూపాలు లేకుండా పోయాయి. ప్రజలారా ఆలోచించండి. జ్యోతిష్యుల ముసుగులో వున్న ఇలాంటి దొంగల చేత మోసపోకండి. వీళ్లను దగ్గరకు రానివ్వవద్దు. వీళ్ళంతా మోసగాళ్లు. వీరంతా వృత్తులు మార్చుకొని సమాజ ఉత్పత్తిలో భాగమైతే మంచిది.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి.హేతువాద సంఘం అధ్యక్షుడు.

ఎంపీ బహిష్కరణ అప్రజాస్వామికం

తృణమూల్ ఎంపీ మొహువా మొయిత్రీని లోక్‌సభ అనైతిక వర్తనం, ధిక్కారం ప్రాతిపదికన బహిష్కరించింది. ఆమె తన అధికారిక వెబ్‌సైట్ ద్వారా పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించడానికి ఉపయోగించాల్సిన తన వ్యక్తిగత ఖాతా పాస్‌వర్డ్ ఇతరుల చేతిలో పెట్టడం. ఆ చర్య ద్వారా లోక్‌సభ గౌరవం కోల్పోయే అవకాశం ఉన్నందున ధిక్కార చర్యగా నేరారోపణ. అలా చెయ్యడం మామూలేనంటూ, అయినా అది ధిక్కార చర్యగా నిబంధనల్లో రాసి లేదన్నది ఆమె వాదన. ఇక రెండోది ఒక కంపెనీ వారి నుండి డబ్బులు తీసుకుని, వారి ప్రత్యర్థి కంపెనీపై లోక్‌సభలో ప్రశ్నలు గుప్పించడం ద్వారా అనైతికంగా ప్రవర్తించడం. ఈ విషయాలపై ఎథిక్స్ కమిటీ విచారణ జరిపి లోక్‌సభకు నివేదిక అందజేసింది. పార్లమెంట్ చర్చ చేపట్టి ఆఘమేఘాల మీద ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసింది. అదేగాక చర్చలో ఆమె వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకపోవడం కూడా సరైన నిర్ణయం కాదు. ముఖ్యంగా పార్లమెంట్‌లో ప్రశ్నలన్నీ స్పీకర్ అంగీకారంతోనే అనుమతించబడతాయి. కారణం చెప్పకుండానే ఒక ప్రశ్నను తిరస్కరించే అధికారం ఆయనకు ఉంటుంది. కాబట్టి ఫలానా ప్రశ్న అనుమతించబడిందంటే, దానిపై మరో మాట అక్కరలేదు. ఆమె వేసిన ప్రశ్నలు ఒక కంపెనీని టార్గెట్ చేసినట్టున్నా, పార్లమెంట్ గౌరవానికి కానీ, దేశ శ్రేయస్సుకు గానీ నష్టమేమీ లేదు. ఒకవేళ లంచం తీసుకుని ఆ పనికి పాల్పడ్డా అందుకామె సభ్యత్వం రద్దు చెయ్యడం మరీ పెద్ద శిక్ష. పైగా అలా రద్దు చెయ్యడం ద్వారా ఆమెతో పాటు, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాన్ని కూడా శిక్షించినట్టే భావించాలి. వారి గొంతు పార్లమెంట్‌లో విన్పించే అవకాశం దూరం చేసినట్టే కదా. డబ్బులు తీసుకుని ప్రశ్నలడగడం, ఒక కంపెనీ ప్రయోజనాల్ని వెనకేసుకు రావడం ఒక సభ్యుడు చెయ్యగల నేరం అయినప్పుడు అదే పని ఎన్నికల ఫండింగ్ తీసుకుని పెద్ద స్థాయిలో ఒక పార్టీ చేస్తేనో?! ప్రజాస్వామిక సమాజం ఆలోచించాల్సిన సీరియస్ విషయమిది.

- డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

అభిప్రాయం

రామమందిరమా! విద్యావైద్య అభివృద్ధా?

అయోధ్యలో రాంలాల్ మందిరం నిర్మిస్తామనే మతతత్వ ఎన్నికల హామీతో హిందువుల ఓట్ల బ్యాంకును కొల్లగొట్టి 2014లో బిజెపి తొలిసారిగా కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆపైన మతతత్వాన్ని కాదు..కాదు... హిందూత్వాన్ని పెంచి పోషించే తన విధానాలతో హిందువుల అభిమానాన్ని పెంచుకుపోతూ 2019లో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా బలాన్ని పెంచుకుంది. ఇప్పుడు 2024 ఎన్నికల్లో కూడా విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి చేసే ప్రయత్నంలో భాగమే జనవరిలో తలపెట్టిన రామమందిర ప్రారంభోత్సవం!

ప్రస్తుత దేశ పరిస్థితుల్లో 'దేశాభివృద్ధికి ప్రజావసరాలు తీర్చే విశ్వవిద్యాలయాలు, వైద్య విశ్వవిద్యాలయాలు, జాతికి పునరంకితం చేసే పరిశ్రమలు, బహుళార్థసాధక ప్రాజెక్టులు, వ్యవసాయిక అభివృద్ధి ప్రణాళికలు, అన్ని హంగులతో సకలజన ఆసుపత్రులు కావాలా? లేక అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవమా? విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలి!

వామపక్ష పార్టీలు, ఏ రాజకీయ పార్టీలకూ చెందని, ఏ మతం పట్ల ప్రత్యేకమైన అభిమానం, వ్యతిరేకత లేని విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళా సంఘాలు ఏకమై బిజెపి ఎత్తుగడలను సమాజానికి చెప్పాలి. 'ఈచ్ వన్ టీచ్ టెన్!' నినాదంతో ఆమూలాగ్రం రెండు దఫాల బిజెపి పాలనలో జరిగిన దారుణాలను వివరించాలి! కులం-మతం పరంగా అల్ప సంఖ్యాక వర్గ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొన్న ఎదుర్కొంటున్న, దుర్భర పరిస్థితులను, కోల్పోతున్న మానవ-పౌర హక్కులను సోదాహరణంగా వివరించాలి! అన్నదాతల పోరాటాలు, వారికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను, నూతన పౌరసత్వ చట్టాలను, వాటిని వ్యతిరేకిస్తూ జరిగిన ఐక్య పోరాటాలను చాటిచెప్పాలి! గోద్రా నుండి మణిపూర్ దాకా బిజెపి చేసిన ఘోర కృత్యాలను తెల్పి ప్రజలను నిత్యం జాగరూకులను చేసే ప్రయత్నాలను ఐక్యవేదికగా చేయాలి. దీనికై సాంస్కృతిక దళాలను రూపుదిద్దాలి!


మొత్తం మీద 'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పన్నిన పన్నాగాల గుట్టు రట్టు చేసి, 2024 సార్వత్రిక ఎన్నికలలో అధికారం దక్కకుండా బిజెపిని వేళ్ళతో సహా పెకిలించాలి! లేదంటే భారతదేశం, హిందూ దేశంగా, హిందువుల దేశంగా, లౌకిక రాజ్యాంగాన్ని హిందూ మతతత్వ రాజ్యాంగంగా బిజెపి మార్చే ప్రమాదాన్ని దేశ ప్రజలంతా ఎదుర్కొనక తప్పదు!

- చాకలకొండ శారద,
విశ్రాంత ప్రధానోపాధ్యాయిని,
కావలి, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

నివాళి

త్యాగధనుడు, ఉపాధ్యాయ ఉద్యమ నేత పి.వి.సుబ్బరాజు

పి. విష్ణు



ఉపాధ్యాయ ఉద్యమ నేత పి.వి. సుబ్బరాజు 1917 మార్చి 19న పశ్చిమ గోదావరి జిల్లా జిన్నూరు గ్రామంలో జన్మించారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఎంతో చైతన్యం కలిగిన గ్రామం అది. అక్కడే ఎలిమెంటరీ స్కూల్, పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశలోనే కాంగ్రెసులో చేరి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. అప్పుడే దేశంలో ప్రవేశిస్తున్న సోషలిస్ట్ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. తర్వాత కాంగ్రెసు సోషలిస్ట్ పార్టీలో చేరారు. పాలకొల్లులో విద్యార్థిగా ఉన్నప్పుడే అప్పటి ప్రముఖ కాంగ్రెసు నాయకుడు ఉద్దరాజు రామం మరియు భీమవరం సభలో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయం అయ్యింది. ఉపాధ్యాయుడుగా ఉంటే తన భావాలను మరింత వ్యాప్తి చేయవచ్చుననే భావనతో టీచర్ ట్రైనింగ్‌లో చేరి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. కమ్యూనిస్టు పార్టీలో ఎన్ని విభేదాలు, చీలికలు వచ్చినా తొలినాళ్ళలో పరిచయమైన సుందరయ్య, రామం గారి బాటలోనే చివరి వరకు నిలబడ్డారు.

ఒకవైపు ఉపాధ్యాయుడుగా పని చేస్తూ స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అదే క్రమంలో 1942 తణుకు సమావేశంలో ఉద్దరాజు రామం, పరకాల పట్టాభిరామారావు, భూపతిరాజు లక్ష్మీనరసరాజుతో పాటు సుబ్బరాజు గారిని అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం జైల్లో నిర్బంధించారు. సుబ్బరాజు మాస్టారు గాను కమ్యూనిస్ట్ సుబ్బరాజు గాను పేరుగాంచారు. ఆయన కమ్యూనిస్ట్ అని ఓర్వలేని కాంగ్రెస్ వారు అనేక దూర ప్రాంతాలకు బదిలీ చేయించేవారు. ఆయన మొత్తం సర్వీసులో జిన్నూరు, వాలమర్రు, రాయకుదురు, గణపవరం, వెంప, సిద్ధాంతం, వీరవాసరం, యలమంచిలి, తదితర దూర ప్రాంతాలకు బదిలీ చేయబడ్డారు. వెళ్ళిన ప్రతిచోటా ఒకవైపు ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరు తెచ్చుకోవడం మరొకవైపు అభ్యుదయ భావాల బీజాలు నాటడం. ఈ రెండో విషయాన్ని సహించలేక గ్రామ పెద్దలు ఆయన్ని బదిలీ చేయించడం, విద్యార్థులు దాన్ని వ్యతిరేకించడం ప్రతి సందర్భంలోనూ జరిగేది. గ్రామ గ్రామాన సైకిల్ మీద తిరుగుతూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించారు. ఉద్యమాల్లో రాటుదేలి ఉపాధ్యాయుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సుబ్బరాజు నిరాడంబరత, నిక్కచ్చితనం, ఉద్యమ నిర్మాణ దక్షత ఆయన సొత్తు.

నిద్రాణంలో వున్న పశ్చిమ గోదావరి జిల్లా టీచర్స్ గిల్డ్‌ను పునరుజ్జీవింపచేసి, జిల్లా కార్యదర్శిగా ఎన్నికై సుదీర్ఘ కాలం పని చేశారు. ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖకు ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా సేవలు అందించారు. మహాసభలు నిర్వహించడంలో ఆయనది అందె వేసిన చెయ్యి. ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను 1961లో ఏలూరులో, మరొకసారి తాడేపల్లిగూడెంలో జయప్రదంగా నిర్వహించారు. యాభై ఏళ్ల ప్రజా జీవితంలో అలుపెరగని పోరాటాలు నిర్వహించారు. ధరించే దుస్తులు మొదలు జీవన శైలి వరకు కమ్యూనిస్ట్ తత్వం అడుగడుగునా కనిపించేది. సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రగతిశీల ఉద్యమాలలో భాగస్వామై కష్టాలను లెక్కచేయక, నమ్మిన ఆశయానికి కట్టుబడి జీవితాంతం అచంచలంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్యకు సుదీర్ఘ సన్నిహిత ఉద్యమ సహచరుడు. ఉద్యమ నిర్మాణం కోసం ఎన్నో అగ్ని పరీక్షల్లో చలించకుండా నిలబడిన వ్యక్తి. అధ్యయనం, అనుభవం, ఆచరణ వల్ల ఏర్పడిన కచ్చితమైన నిర్దిష్టమైన రాజకీయ విశ్వాసాలు కలిగిన వ్యక్తి సుబ్బరాజు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజా ఉద్యమాలకు అండదండలందిస్తూ క్రియాశీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయ ఉద్యమమే ఊపిరిగా తుది శ్వాస వరకు రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితమై విశేష కృషి చేశారు సుబ్బరాజు.

అన్ని ప్రాంతాల, అన్ని మేనేజ్‌మెంట్ల, అన్ని కేడర్ల సమైక్య సంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న ఏర్పడిన సంస్థ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) ఆవిర్భావంలో కూడా సుబ్బరాజు పాలు పంచుకున్నారు. యుటియఫ్ ప్రథమ మహాసభలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికై బాధ్యతలు నిర్వర్తించారు. వెంటనే విజయవాడకు మకాం మార్చి ఆఫీసు కార్యదర్శిగా చాలా సంవత్సరాలు పని చేశారు. ఐక్య ఉపాధ్యాయ పత్రికకు సంపాదకవర్గ సభ్యునిగా కొంత కాలం పని చేశారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. ఆర్థికంగా, ఆరోగ్య పరంగా అనేక కుటుంబ సమస్యలు ఎదుర్కొన్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఆశయ సాధన, ఉద్యమాల్లో ఏనాడూ వెనకడుగు వెయ్యలేదు. కుటుంబం ఎంతో కష్ట దశలో ఉన్నా నైతిక ప్రమాణాలను విడిచి పెట్టలేదు. పార్టీ గాని యూనియన్ గాని ఇచ్చిన ప్రతి బాధ్యత నిర్వహించడంలో శభాష్ అనిపించుకొనేవారు. తన ఐదు దశాబ్దాల ఉద్యమంలో త్యాగం, శ్రమ, విలువలు, క్రమశిక్షణ ఆయన మిగిల్చిన ఆస్తులు. ఆయన జీవితం, ఉద్యమ కృషి, నమ్మిన ఆశయం పట్ల నిబద్ధత, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం. 1983 డిసెంబర్ 15న సుబ్బరాజు హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆయన కుమారులు పి.లచ్చిరాజు (బిఎస్ఎన్ఎల్, విశాఖపట్నం), పి.విష్ణు (బ్యాంకింగ్, హైదరాబాదు) కూడా ఇప్పటికీ అభ్యుదయ ఉద్యమాలకు అండదండలు అందిస్తున్నారు. ఏలూరులో యుటియఫ్ జిల్లా కార్యాలయానికి "పి.వి.సుబ్బరాజు టీచర్స్ హోమ్" అని పేరు పెట్టి ఆయన నిబద్ధతకు, సేవలకు శాశ్వత రూపం ఇచ్చారు. సుబ్బరాజు గారి వర్ధంతి సందర్భంగా వారి ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులను చైతన్యపరుస్తూ సమ సమాజ నిర్మాణానికి ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడమే ఆయనకు నిజమైన నివాళి.

(డిసెంబర్ 15 కామ్రేడ్ పి.వి.సుబ్బరాజు 40వ వర్ధంతి)

కవిత్వం

అయ్యా సారూ...!!

కరువు కాని కరువు
కాటేస్తాంటే
అరువు బరువు మోయలేక
కర్షక లోకం కుంగిపోతాంది
పొయ్యి పైన ఎసరు లేని గిన్నె
బిక్కు బిక్కున చూస్తాంటే
దిక్కు తెలియని స్థితిలో
కాలే కడుపు పకపకా
నవ్వుతాండాది
అయ్యా సారూ కాస్త
చూడరాదు.
వాగు వచ్చి సెలకల్ని
తన్నుకెళ్తాంటే
నడుము విరిగిన కంకి
గట్టుకు కొట్టుకొచ్చి
ఏడుస్తుండాది
చిరిగిన అంగీలకు
మరమ్మతులు చేసుకోలేక
సగటు బతుకు
కుమిలిపోతాండాది.
లెక్క కుదిరాక ఎక్కాల్ని
మరచినట్టు
సీటు దొరికినాక
స్థిరత్వాన్ని మరిస్తే ఎట్లా సారూ
గువ్వలు వలసెళ్ళి
గూడు చెదిరిపోతాంటే
ఊరు ఎక్కిళ్ళు పెట్టి
ఏడుస్తుండాది
పూట గడవని బతుకులు
మూల మూలలో
ఒదిగిపోతాంటే
వీధి అంగలార్చుతుండాది
అయ్యా సారూ కాయింత
సూడండ్రీ.
తడి లేని పేగు తల్లడిల్లుతాంటే
బక్క ప్రాణం కంట్లో తడి
పెట్టుకున్నాది
ఉన్నోళ్లకే ఊపిరి అందిస్తాంటే
ఆయాసపడే బడుగు జీవనం
మౌనంగా మూలన
కూర్చుండాది
అయ్యా సారూ
ఎరగని బతుకులు ఎంగిలి
పడలే
కాస్త కనిపెట్టి కనికరించండ్రి.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

పెళ్లిలో విషాదం

- ఆక్సిజన్ సిలిండర్ పేలి బాలిక మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళం వద్ద గల జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం విషాదం చోటు చేసుకుంది. పెళ్లి మండపం వద్ద ఏర్పాటు చేసిన ఆక్సిజన్ సిలిండర్ పేలి బాలిక మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు..పుత్తూరు రూరల్ మండలం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ఓ యువకుడి పెళ్లి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెళ్లి మండపం వద్ద ఏర్పాటు చేసిన స్వాగతం తెలిపే ఆక్సిజన్ సిలిండర్ పేలి పుత్తూరు రూరల్ మండలంలో కృష్ణసముద్రం గ్రామానికి చెందిన మునిశేఖర్ కుమార్ చాందిని (11) మృతి చెందారు. రాంబో తిరుపతి ఈవెంట్ నిర్వాహకులకు తీవ్రగాయాలయ్యాయి. పెళ్లి సందడిలో బాలిక మృతి చెందడంతో విషాదం అలుముకుంది.

ఇద్దరు విద్యార్థులు మిస్సింగ్

- పోలీసులకు ఫిర్యాదు

కదిరి అర్బన్ : కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం పెద్ద తండాకు చెందిన ఇద్దరు విద్యార్థులు కదిరి బస్టాండులో తప్పిపోయారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయక్, విజయకుమారి దంపతుల కుమారుడు 7వ తరగతి చదువుతున్న ధనుష్ నాయక్, 5వ తరగతి చదువుతున్న శశాంత్ నాయక్ నల్లమాడ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు. శని, ఆదివారం సెలవులు కావడంతో వారి సొంత ఊరికి వచ్చారు. తిరిగి మంగళవారం పిల్లలను వారి తల్లి కదిరి నుండి నల్లమాడకు బస్సులో పంపేందుకు బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కి స్కూల్ కు వెళ్లిపోతామని పిల్లలు చెప్పడంతో ఆమె ఇంటికి వెళ్ళిందన్నారు. అయితే పిల్లలు ఇద్దరూ పాఠశాలకు రాలేదని నల్లమాడ గిరిజన ఆశ్రమ స్కూల్ నుండి సంబందిత స్కూల్ టీచర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

అడవిని వీడి జనారణ్యంలోకి!

- పల్లెసీమలో ఏనుగుల కలవరం
- పంటలు కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు జాగారం
- అధికారులు, పాలకులపై విమర్శల వెల్లువ


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి తోట

ప్రజాశక్తి-చిత్తూరు

కౌరణ్యంలో ఉండాల్సిన ఏనుగుల మంద.. ఊళ్లు.. పంటలపై దూసుకొచ్చి విధ్వంసం సృష్టిస్తున్నాయి. పొలాలను తొక్కేస్తూ.. రైతులను చంపేస్తూ పల్లెసీమలను కలవర పెడుతున్నాయి. సత్యమంగళం అడవుల నుంచి వేర్వేరుగా విడిపడి.. గుంపు గుంపులుగా శేషాచలం, కౌండిన్య అటవీ ప్రాంతాల్లో తిష్టవేశాయి. గత ఏడాది శేషాచలం అటవీ పరివాహక ప్రాంతాల్లోని తిరుపతి, పిచ్చాటూరు, నాగలాపురం, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో దాడులు చేశాయి. ఈ ఏడాది కౌండిన్య అటవీ ప్రాంతాల్లోని ఆవాసంగా మార్చుకొని గుంపుల్లో విడివడి తిరుపతి జిల్లా పాకాల మండలంలోని చిత్తూరు జిల్లా పుంగనూరు, పూతలపట్టు, కుప్పం, పలమనేరు నియోజకవర్గ ప్రాంతాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. చేతికొచ్చే పంటలను నాశనం చేస్తుండటంతో అన్నదాతలు లబోదిబోమంటూ విలపిస్తున్నారు. ఎదురుపడ్డ రైతులు, పశువుల కాపరులను చంపేస్తుండడంతో స్థానికులు హడలెత్తిపోతున్నారు. అటవీశాఖ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఇలాకాలో ఏనుగుల దాడులు కొనసాగుతూ తీవ్రనష్టం కలిగిస్తుండటంతో వారి నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సరిహద్దులో గజగజ

కర్నాటక, తమిళనాడు, ఆంధ్ర సరిహద్దులో సోమవారం 50-60 ఏనుగుల మంద హోసూరు నుంచి వచ్చినట్లు కలకలం రేగింది. ఇప్పటికే పుంగనూరు ప్రాంతంలో ఓ ఏనుగుల గుంపు, రామ కుప్పం వద్ద రెండు ఏనుగులు, బంగారుపాళ్యం వద్ద మరో గుంపు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవికాక మరో ఏనుగుల మంద వచ్చిందన్న సమాచారంతో సరిహద్దు ప్రాంతంలో పంటలు పండించిన రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పల్లెల్లో ఏనుగులొస్తున్నా యంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల కదలికలు ఉండడంతో అధికారులూ అప్రమత్తం అయ్యారు.

పంటలపై దాడులు

నిత్యం పంటలపై ఏనుగులు దాడులు చేసి నాశనం చేస్తూ రైతులను ముంచేస్తున్నాయి. అరటి, వరి, టమోటా, బొప్పాయి, మామిడి, మొక్కజొన్న తోటల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ఇవి కాక డ్రిప్‌పైపులు, పైపులు వంటివి ధ్వంసం చేస్తున్నాయి. నిత్యం పొలాల్లో దాడులు జరుగుతుండడంతో రైతులు పంటలను కాపాడుకోలేక, ఇటు ఏనుగుల గుంపును మళ్లించలేక రాత్రింబవళ్లు జాగారాలు చేయాల్సి వస్తోందని కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రత్యేకంగా ఎలిఫెంట్ శాంక్చురీ

పలమనేరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో 360 చదరపు కిలోమీటర్ల, విస్తీర్ణంలో 88400ఎకరాల్లో కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని 1990లో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఏనుగుల సంచారానికి సురక్షితమని అధికారులు గుర్తించారు. అందుకు ఏర్పాట్లు చేసిన ప్రటికీ నిర్వహణ లోపం వల్ల గజరాజులు అటవీ ప్రాంతాలను వీడి పంటలపైకి దూసుకొస్తున్నాయి. గడిచిన 30ఏళ్లలో సుమారు 60మందికి పైగా గజదాడుల్లో మృత్యువాత పడినట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

పరిష్కార మార్గానికి ఆలస్యం

వెనువెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పరిష్కార మార్గాన్ని అన్వేషించకుంటే ముప్పు తప్పేలా లేదని విశ్లేషకుల భావన. ప్రజలను, పంటలను, ఏనుగులను కాపాడటం నిత్యకృత్యం. పెద్ద ఎత్తున కందకాలు తవ్వి ఏనుగుల గుంపును అటవీ ప్రాంతాల్లో వంపాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. పంట పొలాలపైకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పంటపైకి వస్తున్న ఏనుగులు విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడుతున్నాయి. మరికొన్ని గాయాలపాలై.. ఇంకొన్ని వివిధ కారణాలతో మరణిస్తున్నాయి. ఏనుగులు వరుస మరణాలు వాటి భవిష్యత్‌కు కూడా ముప్పే.

నేడు శ్రీకాకుళం జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లాకు రానున్నారు. పలాసలో నూతనంగా నిర్మించిన కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, కంచిలిలో వైఎస్ఆర్ సుజలధార మంచినీటి ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రి నుంచి హెలిప్యాడ్ వరకు, అక్కడ్నుంచి బహిరంగ సభ నిర్వహించే రైల్వే క్రీడా మైదానం వరకు సిఎం జగన్ రోడ్ షోగా వెళ్లే బస్సుతోపాటు కాన్వాయ్‌తో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డుకు ఇరువైపులా భారీస్థాయిలో బారికేడ్లను ఏర్పాటు చేశారు.


మాస్టర్ దరహాస్‌ను అభినందిస్తున్న హారికా ప్రసాద్

స్విమ్మింగ్‌లో దరహాస్‌కు బంగారు పతకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తిరుపతిలో గత నెల 9 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సిమ్మింగ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ -19 కేటగిరిలో శ్రీకాకుళం నగరానికి చెందిన మాస్టర్ విడి దరహాస్ రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. న్యూఢిల్లీలో జనవరి మూడు నుంచి 9 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించ నున్నారు. పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారిక ప్రసాద్, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు కరణం శోభారాణి, కోశాధికారి తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

రాష్ట్రస్థాయి సిమ్మింగ్ పోటీలు ఈనెల 16, 17 తేదీల్లో నరసరావుపేటలో జరగనున్నాయని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారిక ప్రసాద్ తెలిపారు. వీటిలో ఎంపికైన వారు బెంగుళూరులో ఈ నెల 27 నుంచి 29 వరకు సౌత్ జోన్ నేషనల్‌కు అర్హత సాధిస్తారని చెపారు.

బలిమెల రిజర్వాయర్ నీటి నిల్వలపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలపై ఆయా రాష్ట్రాల అధికారులు జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కోకో అతిథి గృహంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023- 24 నీటి సంవత్సరం 2023 జూలై నుంచి ఇప్పటివరకు ఏ రాష్ట్రం ఎన్ని టీఎంసీలు నీటిని వినియోగించుకున్నదో లెక్కలు తేల్చారు. ఆంధ్ర 2022 -23 నీటి సంవత్సరంలో ఒరిస్సా కంటే అదనంగా వాడుకున్న 13.7578 టీఎంసీలతో కలిపి ఈ ఏడాది (2023- 24 నీటి సంవత్సరంలో) నవంబర్ 30 నాటికి 33.4957 నీటిని వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ఒరిస్సా ఇప్పటి వరకు 31.3932 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ఆంధ్ర, ఒడిస్సా కంటే ఇప్పటివరకు 2.1025 టీఎంసీలు నీటిని అదనంగా వినియోగించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపూట్ జలాశయాల్లో 64.1397 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఆంధ్ర వాటాగా 31.0186 టిఎంసిలు, ఒరిస్సా వాటా 33.1211 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ఇరు రాష్ట్రాల గ్రిడ్ డిమాండు, ఇరిగేషన్ అవసరాలు నిమిత్తం ఆంధ్రాకు 2500 క్యూసెక్కుల నీటిని, ఒరిస్సాకు 1500 క్యూసెక్కుల నీటిని బలిమిలా జలాశయం నుంచి విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య అంగీకారం కుదురింది. ఈ కార్యక్రమంలో ఒడిస్సా తరపున పొట్టేలు ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ (సివిల్) పితబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంత్ పాత్రో, ఏఈలు తుసార్ రాజన్ కుంత, గడదర్ ప్రధాన్, ఒరిస్సా హైడల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్, సీలేరు ఏపీ జెన్కో ఎస్ఈ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈ జి.ప్రభాకర్, ఏడీఈ అప్పలనాయుడు, ఏఈ సిహెచ్. సురేష్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు

జిఒ3పై ముఖ్యమంత్రి మౌనం వీడాలి

- 2024 జాబ్ కేలండర్ ప్రకటించాలి
- అన్ని పోస్టులూ భర్తీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)

జిఒ3పై ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మౌనం సరికాదని, 2024 జాబ్ కేలెండర్ వెంటనే ప్రకటించాలని, సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో స్థానిక నిరుద్యోగులకు వందశాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం గిరిజన యువతను మోసగించడమేనన్నారు. బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలకు ఎస్‌టి రిజర్వేషన్‌కల్పిస్తూ ప్రభుత్వం జిఒ జారీచేయడం, జిఒ 3రద్దుపై తగురీతిలో ప్రభుత్వం స్పందించకపోవడం వంటి వ్యవహారాల్లో ముఖ్యమంత్రి మిన్నకున్నట్లే, గిరిజన ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడంపై మున్ముందు తగు మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న 897 గ్రూప్-2 పోస్టులకు, 8న 81గ్రూప్-1 పోస్టులకు నామమాత్రంగా నోటిఫికేషన్‌ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని, అన్ని పోస్టులను ప్రకటించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాలున్నరేళ్లుగా గ్రూప్స్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన లక్షలాది మంది నిరుద్యోగులకు నిరాశ కల్పించేలా ప్రభుత్వ ప్రకటన ఉందన్నారు. ఇప్పటికే పలువురి వయస్సు మీరిపోయిందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని సవరించాలని కోరారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

- రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహనరావు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి దళారీల దోపిడీని అరికట్టాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అన్నారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో బుధవారం రైతు సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలను గురువారం పలాస వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తమని అన్నారు. రైతుల నుంచి సేకరించిన లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకి రూ.16 వేలు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జీడి రైతులను నాలుగేళ్లుగా మోసం చేస్తున్నారన్నారు. గతంలో రూ.14 వేలు ధర పలికితే... ప్రస్తుతం రూ.7 వేలు విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీడి రైతులను ఆదుకుంటామని సిఎం బహిరంగ సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విదేశాల జీడి పిక్కల దిగుమతులపై ఆంక్షలు విధించాలన్నారు. కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి జీడి పంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. తిత్లీ తుపానులో నష్టపోయిన జీడి, కొబ్బరి రైతులకు ఇప్పటికీ రెట్టింపు పరిహారం అందలేదని అన్నారు. జీడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సత్తుపల్లి కృష్ణారావు, కోనేరు గురయ్య, అంబటి రామకృష్ణ, యంపల్ల జోగారావు పాల్గొన్నారు.

పిఠాపురంలో రైల్వే ప్రయాణికుల ఆందోళన


- పట్టాలపై నిరసనతో నిలిచిన రైలు

ప్రజాశక్తి- పిఠాపురం (కాకినాడ జిల్లా)

అయ్యప్పస్వామి మాలధారులు, ప్రయాణికులకు మధ్య జరిగిన వివాదంలో పిఠాపురంలో ఉద్రికత్తత నెలకొంది. రిజర్వేషన్ బోగీల్లో సైతం సాధారణ ప్రయాణికులు ఎక్కడంతో ఈ వివాదం నెలకొంది.

సాధారణ ప్రయాణికుల ఎక్కడంతో అయ్యప్ప స్వామి భక్తులంతా ఏకమై వారిని కిందకి తోసేశారు. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. రైలు ఇంజన్ ముందు ట్రాక్‌పై బైఠాయించి నిరసన తెలిపారు.

అక్కడకు చేరుకున్న పోలీసులు పలువురిని రైలు ఎక్కించే ప్రయత్నం చేశారు. ట్రైన్ అద్వానంగా మారుస్తున్నారని తమకు రిజర్వేషన్ ఉందని రిజర్వేషన్ లేని వాళ్ళని ఎలా ఎక్కిస్తారని అయ్యప్ప స్వాములు పోలీసులను ప్రశ్నిం చారు. పోలీసులు వారిక సర్ది చెప్పి కొంత మందిని రైలు ఎక్కించారు. మిగిలిన వారిని ఇతర రైళ్లలో పంపించారు. సాధారణ భోగీల సంఖ్యను తగ్గించడంతో రైలులు అన్ని కిక్కిరిసి ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సాధారణ భోగీల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


పిఠాపురం రైల్వేస్టేషన్లో పట్టాలపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

లెక్చరర్లకు యునెస్కో శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ కళాశాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీలో ప్రభుత్వ కళాశాల లెక్చరర్లకు బుధవారం యునెస్కో శిక్షణ ప్రారంభించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాల లెక్చరర్లకు వారి ద్వారా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించడం కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎపి కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోల భాస్కర్ ప్రారంభించారు. అకాడమీలో డిసెంబర్ 17 వరకూ నిర్వహించే ఈ మాస్టర్ ట్రైనర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 60 మంది పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సి.కృష్ణ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ రిచా బన్సల్, శోబితా రావు, నూజిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిరోషిమా డేపై విద్యార్థులకు అవగాహన

హిరోషిమా నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యమం నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులకు చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్‌కె.మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. అణు ఇంధన వనరుల వినియోగం మీద పలు వైజ్ఞానిక అంశాలు వివరించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, అధ్యాపకులు డి.సంజీవ్ కుమార్, బి.గౌరి నాయుడు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టి సర్వీసులు తగ్గించడం తగదు

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సులకు రోజురోజుకూ ఆక్యుపెన్సీ రేట్ తగ్గిపోవడంపై అధ్యయనం చేయకుండా, సర్వీసులను తగ్గించడం తగదని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ పేర్కొంది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణాను అభివృద్ధి చేయకుండా, బస్సు సర్వీసులను తగ్గించడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం అయ్యాక కూడా లాభ నష్టాల పేరుతో సర్వీసులు నడపడం సరికాదన్నారు. ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి -ఎన్‌ఎంయు

ఆర్‌టిసిలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఎపిపిటిడి ఎన్‌ఎంయు చేపట్టనున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డిమాండ్స్ డే నాడు ఉద్యోగులంతా బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని కోరారు.

అసంతృప్తి రావడం సహజమే..

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ రాష్ట్రంలో 175కు 175 అసెంబ్లీ సీట్లు గెలవాలనే లక్ష్యంతో ముందుకుపోతోందని, ఈ నేపథ్యంలోనే అభ్యర్థులను మార్చినపుడు అసంతృప్తి రావడం సహజమేనని, అవి సర్దుకుంటాయని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు కార్యకర్తలెవరూ పట్టించుకోలేదనే పవన్‌కల్యాణ్‌ను టిడిపి నమ్ముకుని రాజకీయాలు చేస్తోందన్నారు. కరోనా సమయంలో విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజల ఎకానమీ దెబ్బతినకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. టిడిపికి 175 స్థానాల్లో పోటీ చేసే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.



అప్పల బాధతో దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - ముదినేపల్లి (ఏలూరు జిల్లా)

అప్పుల బాధ భరించలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషాదఘటన మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రి పాలెంలో మంగళ వారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పరసా నాగబాబు(30)కు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన అనూష(25)కు 2015లో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. నాగబాబు కొంతకాలంగా కౌలుకు మూడు ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. సాగులో నష్టాలు రావడంతో సుమారు రూ.పది లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక నాగబాబు దంపతులు ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనూష తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు. మృతదేహాలకు గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నేవీ డిపో ఆపకుంటే 'యుద్ధ'మే..!

- గ్రామసభలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత
- అధికారులపై వంకావారిగూడెం, పరిసర గ్రామాల ప్రజలు మండిపాటు
- ఏజెన్సీలో గిరిజనులను బతకనీయరా అంటూ ఆవేదన
- ఇప్పటికే 'పోలవరం' పేరుతో వేల గిరిజన కుటుంబాలది తలోదారి
- డిపోను అడ్డుకునేందుకు దేనికైనా సిద్ధమంటూ జనం హెచ్చరిక



గ్రామసభలో డిపోకు వ్యతిరేకంగా చేతులు ఎత్తిన గిరిజనులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో 1,166 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని చూస్తున్న నేవీ యుద్ధ సామగ్రి డిపోపై స్థానిక ప్రజానీకం తిరుగుబాటుకు దిగారు. తమను సంప్రదించకుండా తమ భూముల్లో సర్వేలు నిర్వహించి, భూసేకరణ చేసేందుకు ముందుకు సాగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో యుద్ధసామగ్రి డిపోను వ్యతిరేకిస్తూ గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తమ మనోభావాలకు వ్యతిరేకంగా యుద్ధసామగ్రి డిపో ఏర్పాటుపై ముందుకు సాగితే ప్రజాయుద్ధం తప్పదని అధికారులను హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో నేవీ యుద్ధసామగ్రి డిపోను ఏర్పాటు చేయాలని కేంద్రంలోని మోడీ సర్కార్ పూనుకుంది. విషయం బయటికి రాకుండా ముందుగానే అధికారులతో సర్వేలు సైతం చేయించింది. కేంద్రం నిర్ణయానికి రాష్ట్రం వంత పాడటంతో అధికారులు అక్కడి ప్రజలకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ముందుకు సాగుతున్నారు. యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు విషయం బయటికి రావడంతో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకావారిగూడెం, దాట్లవారిగూడెం, కొత్తసీమలివారి గూడెం, రమణక్కపేట ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. డిపోను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు వద్దంటే వద్దంటూ తేల్చి చెప్పేశారు.

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే తీవ్ర నష్టమే

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే జీలుగుమిల్లి మండలంలో తీవ్ర నష్టం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గిరిజనులకు చెందిన వేలాది ఎకరాల భూమి నేవీ చేతిలోకి వెళ్లిపోతుంది. గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేయాల్సి ఉంటుంది. డిపో ఏర్పాటైన తర్వాత చుట్టుపక్కల కిలోమీటర్ల మేర ఆంక్షలు, నిర్బంధాలు కొనసాగుతాయి. సొంత గ్రామాలకు వెళ్లాలన్నా తనిఖీలు చేసే పరిస్థితి ఉంటుంది. ఇంకా అనేక ఫ్యాక్టరీలు ఏర్పాటుకు అడుగులు వేసి భూములను లాగేసుకునే పరిస్థితి ఏర్పడనుంది. ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న మాటలన్నీ బూటకమే అంటున్నారు. నేవీ యుద్ధసామగ్రి డిపోలో నిపుణులైన ఉద్యోగులు మాత్రమే పని చేస్తారు. అంటే స్థానిక ప్రజానీకానికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండదు. అటెండర్, శుభ్రత పనులకోసం కొంతమందిని తీసుకున్నా అవి తాత్కాలికమేనని చెప్పొచ్చు. జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాలు ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు పేరుతో పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మూడు మండలాల్లోని గిరిజనులను ఖాళీ చేయించి తలోదారి అన్నట్లు గ్రామాల నుంచి తరిమేశారు. పుట్టిన ఊరును వదిలేసి వారంతా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలో నేవీ యుద్ధ సామగ్రి ఏర్పాటు చేసి ఇక్కడ గిరిజనులను కూడా తరమివేయాలని చూస్తున్నారు. గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో అందరిలోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదే డిపోను మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ అటువైపు కాకుండా తక్కువ ధరకు గిరిజనుల భూములను కాజేసేందుకు ప్రణాళిక రచించారు. నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే జీలుగుమిల్లి మండలం మొత్తం నేవీ కనుసన్నల్లోకి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడనుంది. యుద్ధ సామగ్రి డిపోనకు వ్యతిరేకంగా తాము దేనికైనా సిద్ధమని గిరిజనులతోపాటు, ఆ ప్రాంత ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు.

ప్రతిపాదనలు ఘనం... పెట్టుబడులు స్వల్పం



- జమ్మూకాశ్మీర్ పరిస్థితిపై వాస్తవాలు కప్పిపెడుతున్న కేంద్రం

శ్రీనగర్ : ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానానికి ఓ విషయాన్ని తెలియజేసింది. ఈ అధికరణ జమ్మూకాశ్మీర్ అభివృద్ధికి, పురోగతికి అవరోధంగా ఉన్నదని చెప్పింది. దీనిని రద్దు చేయాలని 2019 ఆగస్ట్ ఐదున పార్లమెంట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మొదలైందని తెలిపింది. అయితే కేంద్ర ప్రభుత్వ వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదని గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం 2021 జనవరిలో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. గత మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం 42 పారిశ్రామిక రంగాలలో రూ.84,544 కోట్ల విలువైన ప్రతిపాదనలు అందుకుంది. అయితే వీటిలో కార్యరూపం దాల్చినవి చాలా తక్కువ. ఇప్పటి వరకూ జమ్మూలో 266, కాశ్మీర్‌లో 148... మొత్తం 414 యూనిట్లు నమోదయ్యాయి. వీటి ద్వారా వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.2,518 కోట్లు మాత్రమే. జమ్మూకాశ్మీర్‌లో అతిథ్య రంగం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ అక్కడ హోటళ్ల ఏర్పాటుకు ఇప్పటి వరకూ కేవలం రూ.87 కోట్ల విలువ కలిగిన ప్రతిపాదనలు మాత్రమే వచ్చాయి. భూ సమస్య కారణంగా ఆశించిన స్థాయిలో పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

జీ-20 సదస్సు సందర్భంగా దేశానికి వచ్చిన విదేశీ ప్రతినిధులను ప్రభుత్వం కాశ్మీర్‌కు తీసికెళ్లి అక్కడ పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతగా అవకాశాలు ఉన్నాయో వివరించింది. అయినప్పటికీ ఆశించిన ఫలితం చేకూరలేదు. వాస్తవాలు ఇలా ఉంటే సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదన మరోలా ఉంది. 'తాము ఏమి కోల్పోయామో ప్రజలు ఇప్పుడు తెలుసుకుంటున్నారు. ఇప్పుడు పెట్టుబడులు వస్తున్నాయి. పోలీస్ వ్యవస్థ కేంద్రం అధీనంలో ఉండడంతో టూరిజం మొదలైంది. 16 లక్షల మంది పర్యాటకులు వచ్చారు' అని ఆయన చెప్పుకొచ్చారు.

విలువకు సంబంధించిన పెట్టుబడి ప్రతిపాదనల్లో 60% జమ్మూకు చెందినవి కాగా మిగిలినవి కాశ్మీర్‌కు చెందినవి. కానీ సంఖ్యాపరంగా చూస్తే జమ్మూకు 1,551 ప్రతిపాదనలు, కాశ్మీర్‌కు 4,566 ప్రాతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. పెట్టుబడులకు సంబంధించి రూ.28,400 కోట్ల కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకం ఇప్పటికే తన కోటాను పూర్తి చేసుకుంది. ఈ ప్రోత్సాహక పథకంలో అదనంగా రూ.75 వేల కోట్లు చేర్చాలన్న ప్రతిపాదన కేంద్రం వద్ద సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉంది.

పెట్టుబడిదారులకు అందజేసేందుకు జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వ భూములేవీ ఖాళీగా లేవు. భూసేకరణ కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ అందుకు కొంత సమయం పడుతుంది. జమ్మూకాశ్మీర్‌లో జేఎస్‌డబ్ల్యూ, హెచ్‌ఎఫ్‌సీఎల్ వంటి కొన్ని బడా కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. ప్రారంభంలో అపోలో హాస్పిటల్స్ కొంత ఆసక్తి చూపినప్పటికీ ఆ తర్వాత వెనకడుగు వేసింది.

కొత్త సర్వీస్ రూల్స్ వద్దు

- ఎపిఎస్‌ఇబి ఇంజినీర్స్, ఎఇఇ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పాత సర్వీస్ రూల్స్‌నే కొనసాగించాలని, కొత్తవి వద్దని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డు ఇంజినీర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ కోరాయి. ఈ మేరకు ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డికి ఇరు సంఘాల ప్రధాన కార్యదర్శులు ఎస్ ప్రతాప్, పి ప్రతాప్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. కొత్త నియామకాల్లో గ్రాడ్యుయేట్ ఇంజినీర్ల కేడర్ పేరు మార్చి ప్రత్యేక ఉద్యోగోన్నతి తీసుకొచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఈ విధానాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఒకే విధమైన పనిలో కేడర్ వేరుగా ఉంటాయని, దీనివల్ల ఉద్యోగుల మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. దీనివల్ల సంస్థల పనితీరుకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఉన్న సర్వీస్ రూల్స్‌నే యథావిధిగా కొనసాగించాలని కోరారు.

ప్రాణాంతకమైన కుక్కల దాడులు

- దేశవ్యాప్తంగా పలువురు ప్రాణాలు కోల్పోతున్న తీరు
- అధికార యంత్రాంగాలు దీనిని నియంత్రించాలి
- సామాజికవేత్తల పిలుపు



న్యూఢిల్లీ : భారత్‌లో వీధి కుక్కల దాడులు తీవ్రమవుతున్నాయి. ఇలాంటి సంఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాల పర్యవేక్షణ కరువవటంతో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో వీధి కుక్కల దాడులపై హెచ్చరికలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు, సంబంధిత అధికార యంత్రాంగాలు ఈ విషయంలో వెంటనే దృష్టి సారించి, దాడులను నియంత్రించాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

వీధి కుక్కల దాడుల్లో ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు బాధితులుగా మిగులుతున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నమోదైన ఘటనలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రమాదాలకు సంబంధించిన వైరల్ వీడియోలు సోషల్ మీడియాలో చర్చలను ప్రేరేపిస్తాయని కుక్కల ప్రవర్తనను అధ్యయనం చేసే కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పరిశోధకురాలు అనిందిత భద్ర అన్నారు. ప్రజలు ఇప్పుడు ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) సమాచారం ప్రకారం.. ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షల సంఖ్యలో వీధి కుక్కల దాడులు జరుగుతున్నాయి. ఇది రేబిస్‌తో పదివేల వార్షిక మరణాలకు దారి తీస్తున్నది. కుటుంబ, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ ఏడాది 25 లక్షల కుక్కకాటు కేసులను నమోదు చేసింది. మార్స్ పెట్‌కేర్ డేటా ప్రకారం భారత్‌లో దాదాపు 6.5 కోట్ల వీధికుక్కలు ఉన్నాయి. ఈ సంఖ్య ప్రపంచంలోనే అత్యధికం కావటం గమనార్హం. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాలను ఒత్తిడి చేసేందుకు భారత పౌరులు తమ రాష్ట్రాల్లో కోర్టులను ఆశ్రయించారు. అందుకు అనుగుణంగానే న్యాయస్థానాలు ప్రభుత్వాలకు, స్థానిక యంత్రాంగాలకు ఆదేశాలు జారీ చేశాయి.

కుక్క కాటుతో గాయపడిన వారికి నష్టపరిహారం అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు తీర్పు చెప్పింది. అధికారులు బాధితులకు కుక్కకాటు గాయానికి కనీసం రూ.10,000 చెల్లించాలనీ, చర్మంపై మాంసం తీసి ఉంటే కనీసం రూ.20,000గా నిర్ణయించింది. గాయాలను పరిశీలించి చెల్లింపులను నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా తీర్పునిచ్చింది.

2021 అధ్యయనం ప్రకారం.. కుక్కల సంఖ్య వేగంగా పెరుగుతున్న పట్టణ ప్రాంతాలు నివాస ప్రాంతాలు. ఇవి చెత్త కుప్పలతో సహా స్థిరమైన ఆహార వనరులను అందిస్తాయి. చాలా మంది భారతీయులు కూడా జాలితో జంతువులకు ఆహారం ఇస్తారు. అయితే, అధికార యంత్రాంగాలతో పాటు కుక్కలను పెంచే, పెంచుకునే యజమానులు సైతం బాధ్యతగా వ్యవహరించి ఈ ప్రమాదాలకు ముగింపు పలకాలని సామాజికవేత్తలు, పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.



అర్ధనగ్నంగా ధర్నా చేస్తున్న నిర్మాణ కార్మికులు

నిర్మాణరంగ కార్మికుల అర్ధనగ్న ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సరఫరాను పునరుద్ధరించి లక్షలాది మంది నిర్మాణరంగ కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ భవన నిర్మాణరంగ కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం అర్ధనగ్నంగా కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఉపాధిని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. రూ.1900 కోట్ల వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికులకు ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఇచ్చిన 1214 మెమో ఎత్తివేయాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. స్టీలు, ఐరన్, ఇసుక తదితర మెటీరియల్ ధరలు ఎన్నో రెట్లు పెరిగాయని వాపోయారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో జిల్లా నాయకులు చినిమిల్లి రాంబాబు, ఎసి రెడ్డి,వి.మాధవ, కెల్లా దుర్గాప్రసాద్, రెడ్డి లక్ష్మణరావు, సిఐటియు నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథం పాల్గొన్నారు.

భూ కేటాయింపుల్లో అవకతవకలు

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం పరిశ్రమల కోసమంటూ కేటాయించిన భూ కేటాయింపుల్లో పెద్దయెత్తున అవినీతికి పాల్పడిందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురంలో అపారెల్ పార్కు కోసం ఇచ్చిన 350 ఎకరాలను ఇతర అవసరాలకు మళ్లించారని, కృష్ణపట్నం అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్ కోసం ఇచ్చిన 350 ఎకరాలు ఇతర అవసరాలకు మళ్లించడంపై చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సిఎం క్లియరెన్స్ కేటాయింపులు చేస్తున్నారని విమర్శించారు. తమకు కేటాయించిన 2,680 ఎకరాల్లో కృష్ణపట్నం అల్ట్రా మెగాపవర్ ప్రాజెక్టును నిర్మించలేమని, తాము బ్యాంకు గ్యారెంటీగా పెట్టిన రూ.300 కోట్లను తిరిగి ఇచ్చేయాలని ఆ సంస్థ 2016లో ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. ఆయా భూములను వెనక్కి తీసుకోకుండా అదే సంస్థలో భాగస్వామైన రిలయన్స్‌కు కట్టబెట్టిందని ఆరోపించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి : నాగబాబు

తుపాను వల్ల నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు డిమాండ్ చేశారు. ఎకరాకు లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

భారత వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చు : ఎడిబి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 6.7 శాతం పెరగొచ్చని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) అంచనా వేసింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో 6.3 శాతంగా అంచనా వేసింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి చోటు చేసుకోవడంతో ఎడిబి తన అంచనాలను సమీక్షించింది. 2024-25లోనూ 6.7 శాతం వృద్ధి ఉండొచ్చని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూలధన వ్యయాలు పెరగడం, ప్రయివేటు వినిమయం పుంజుకోవడం తదితర అంశాలు జిడిపికి మద్దతు చేయవచ్చని ఎడిబి విశ్లేషించింది.

కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాలి: ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: లోక్‌సభలో అలజడి రేపిన ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలి. రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరాయి. అయితే ప్రతిపక్షాల డిమాండ్‌ను రాజ్యసభాపక్ష నేత, కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ తోసిపుచ్చారు. ప్రతిపక్షాలు దీనిని రాజకీయం చేస్తున్నాయి అని ఎదురుదాడి చేశారు. దీనికి నిరసనగా ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

ఆ చర్యను ఖండిస్తున్నాను
నా కుమారుడు నిజాయితీ పరుడు

సందర్శకుల గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకిన ఇద్దరు దుండగుల్లో ఒకరైన మనోరంజన్ గురించి కర్ణాటక పోలీసులు ఆరా తీశారు. ఈ ఘటన జరిగిన గంటలోపే పోలీసులు అతని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను విచారించగా, తన కుమారుడు ఇటువంటి పని చేయడాన్ని సమర్థించనని, అయితే, అతను చాలా నిజాయితీగల పౌరుడు అని మనోరంజన్ తండ్రి చెప్పాడు.

పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలి

- జంతర్ మంతర్‌లో బిసి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ లో బిసి బిల్లు పెట్టి చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే బిసి ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలోనూ ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలన్నారు. ఈ మేరకు బుధవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన చేపట్టారు. ఎంపిలు బీద మస్తాన్ రావు, బడుగుల లింగయ్య యాదవ్, కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు, ఇతర నేతలు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు. దేశంలో 56 శాతం ఉన్న బిసిలకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 ఏళ్లుగా పోరాడుతోన్నా... కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని శాశ్వత బిచ్చగాళ్లుగా మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాలలో రిజర్వేషన్లు పెడితే ఎంతో ప్రగతి జరిగేదని వ్యాఖ్యానించారు. కులతత్వం కనీస స్థాయికి వచ్చేదన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. వెనకబడిన వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బిసిల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు.

దుబాయ్‌లో 'మహదేవ్' ఓనర్ అరెస్టు

న్యూఢిల్లీ : మహదేవ్ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ యజమానుల్లో ఒకరైన రవి ఉప్పల్‌ను దుబాయ్‌లో అక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఇడి అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా అతడిని దుబాయ్ పోలీసులు గత వారంలోనే రవి ఉప్పల్‌ను అరెస్టు చేశారు. రవిని భారత్‌కు తీసుకొచ్చేందుకు దుబాయి అధికారులతో ఇడి సంప్రదింపులు జరుపుతుంది. ఇక మరో యజమాని సౌరభ్ చంద్రఖర్ కోసం కూడా దుబాయ్ పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాల్ ప్రాంతానికి చెందిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రఖర్ దుబాయ్ కేంద్రంగా భారత్‌లో మహదేవ్ బెట్టింగ్ యాప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ యాప్ ముసుగులో వీరు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఇడి దర్యాప్తు చేస్తోంది. .

అంతానికి ఆరంభం

(మొదట పేజీ తరువాయి)

అల్లాడుతోంది. డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారు. ఇందుకు వాతావరణ మార్పులు ప్రధాన కారణంగా వున్నాయి. ఇటువంటి సమయంలో కాప్ సదస్సుకు ఆ దేశం హాజరు కాలేకపోవడంపై ఆందోళనలు తలెత్తుతున్నాయి. 2021లో తాలిబన్లు కాబూల్‌ను స్వాధీనం చేసుకున్నప్పటి నుండి ఐక్యరాజ్య సమితి నిర్వహించే ఇటువంటి చర్చల నుండి ఆఫ్ఘనిస్తాన్‌ను దూరం పెడుతున్నారు.

అమెరికాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు

వాతావరణ మార్పులపై అమెరికా అనుసరిస్తున్న రెండు నాల్కల ధోరణికి నిరసనగా పెద్ద సంఖ్యలో పర్యావరణ కార్యకర్తలు వాతావరణ సదస్సు నిర్వహిస్తున్న వేదికకు సమీపంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పెట్రోలియంను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉందని, ఈ ఉత్పత్తులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆరోగ్యకరమైన ఆహారం అందటంలేదు

- 74.1 శాతం మంది భారతీయుల పరిస్థితిది
- పోషకాహారలోపంతో ప్రజలు : ఎఫ్ఏఓ నివేదిక



న్యూఢిల్లీ : భారత్‌లో ఆరోగ్యకరమైన ఆహారం ప్రజలకు లభించటం లేదు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయినా.. పౌష్టికాహారం భారతీయులకు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. భారతత్‌లో దాదాపు 74 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఎఫ్ఏఓ.. ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ 2023 ప్రాంతీయ అవలోకనాన్ని ఆవిష్కరించింది.

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. 2021లో 74.1 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. 2020లో ఇది శాతం 76.2గా ఉన్నది. పొరుగుదేశాలైన పాకిస్థాన్‌లో ఇది 82.2 శాతం, బంగ్లాదేశ్‌లో 66.1 శాతం జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెరుగుతున్న ఆహార ఖర్చులు, ప్రజల ఆదాయంతో సరిపోలకపోవటంతో ఎక్కువ మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేని పరిస్థితికి దారితీస్తున్నదని నివేదిక హెచ్చరించింది. కోవిడ్19 మహమ్మారి, 5ఎఫ్(ఆహారం, ఫీడ్, ఇంధనం, ఎరువులు, ఆర్థికం) సంక్షోభం సమయంలో ప్రపంచ దేశాలు భయంకరమైన పరిస్థితులను ఎదురు చూశాయని నివేదిక వెల్లడించింది.

"ఆసియా, పసిఫిక్ ప్రాంతం ప్రపంచంలోని తీవ్రమైన ఆహార అభద్రతలో సగభాగాన్ని కలిగి ఉన్నది. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు ఆహార అభద్రతతో ఉన్నారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో పెరుగుదల, ఎత్తుకు తగిన బరువు లేకపోవటం, అధిక బరువు, అలాగే పునరుత్పత్తి వయస్సు గల స్త్రీలలో రక్తహీనత వంటి ప్రాబల్యం రేట్లు ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ(డబ్ల్యూహెచ్ఏ) ప్రపంచ పోషకాహార లక్ష్యాల పరంగా ఇప్పటికీ మార్కులకు దూరంగా ఉన్నాయి" అని నివేదిక పేర్కొంది. భారతదేశ జనాభాలో 16.6 శాతం మంది పోషకాహార లోపంతో ఉన్నారు. "దక్షిణాసియా తీవ్రమైన ఆహార అభద్రత అధిక ప్రాబల్యాన్ని చూపించింది. ఇది తూర్పు ఆసియాలో తీవ్రమైన ఆహార అభద్రత అతి తక్కువగా ఉన్నది. ప్రపంచంతో పోలిస్తే, దక్షిణాసియాలో 2015 నుంచి తీవ్రమైన ఆహార అభద్రత ఎక్కువ శాతం ఉన్నది" అని నివేదిక పేర్కొన్నది.

భారత్‌లో ఐదేండ్లలోపు పిల్లల్లో 31.7 శాతం మంది ఎదుగుదల మందగమనంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తక్కువ బరువు ఐదేండ్లలోపు 18.7 శాతం మంది పిల్లలు ఈ ప్రధాన ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశంలోని 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళల్లో 53 శాతం మందికి రక్తహీనత ఉన్నది. "ఇది (రక్తహీనత) మహిళల్లో ఆరోగ్యం, శ్రేయస్సును దెబ్బతీస్తుంది. ప్రతికూల ప్రసూతి, నవజాత ఫలితాల ప్రమాదాన్ని పెంచుతుంది" అని నివేదిక హెచ్చరించింది. దేశంలోని పెద్దలలో 1.6 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. 0-5 నెలల వయస్సు గల శిశువులలో తల్లిపాలు ఇవ్వడంలో భారతదేశం 63.7 శాతంతో ఉన్నది.

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర జోక్యాన్ని అడ్డుకోండి

- కేంద్రం చర్యలతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,07,513.09 కోట్లు వ్యయ నష్టం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు బుధవారం కేరళ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటోందని, రుణం తీసుకునే అధికారాన్ని పరిమితం చేస్తోందని విమర్శించింది. కేంద్రం చర్యలు సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని వాదించింది. ఎగ్జిక్యూటివ్ చర్యలతో కేంద్ర ప్రభుత్వం "తన బడ్జెట్ ప్రక్రియపై నియంత్రణను తీసుకుంది. రాష్ట్రానికి రుణాలు తీసుకునే స్వంత ఆర్థిక వ్యవస్థలను నియంత్రించే అధికారంలో కేంద్రం జోక్యం చేసుకుంది" అని కేరళ ప్రభుత్వం పేర్కొంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం కేరళ తన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో దావా వేసింది. కేంద్ర ప్రభుత్వం రుణ పరిమితిని విధించడం వల్ల సంవత్సరాలుగా చెల్లించని బకాయిలు పేరుకుపోతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ చర్యలతో 2016-2023 ఆర్థిక సంవత్సరంల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,07,513.09 కోట్ల సంచిత వ్యయ నష్టం, వనరుల లోటును చవిచూసిందని కోర్టు తెలిపింది. ఈ కారణంగానే రాష్ట్రం తన వార్షిక బడ్జెట్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 ప్రకారం రాష్ట్ర ఆర్థిక స్వయం ప్రతిపత్తికి అనుగుణంగా రాష్ట్రానికి చెందిన కన్సాలిడేటెడ్ ఫండ్ భద్రత లేదా హామీపై రుణం తీసుకోవడానికి రాష్ట్రానికి ప్రదానం చేసిన కార్యనిర్వాహక అధికారాన్ని కేరళ ప్రభుత్వం ప్రస్తావించింది. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసే రాజ్యాంగ హక్కు, అధికారం కేంద్రానికి లేదు. ఇది రాష్ట్రం ప్రత్యేక ఆర్థిక డొమైన్‌లను అతిక్రమించడంతో సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది" అని కేరళ పేర్కొంది. కాగా, ఈ కేసు వచ్చే ఏడాది జనవరిలో విచారణకు రావచ్చు. ఎందుకంటే సుప్రీంకోర్టు శీతాకాల సెలవులు డిసెంబర్ 16 (శనివారం) నుండి ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది జనవరి 02 (మంగళవారం)న తిరిగి సుప్రీంకోర్టు పునఃప్రారంభం కానుంది.కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టు నుండి తక్షణ జోక్యాన్ని కోరింది. కేరళ రాష్ట్రం ఆర్థికంగా నష్టపోతుందని, ఇది కేరళ వంటి చిన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొంది. "నష్టాన్ని నివారించకపోతే, కేరళ రాష్ట్రం, దాని కొద్దిపాటి వనరులతో, దశాబ్దాల పాటు దీని నుండి కోలుకోలేము" అని ప్రభుత్వం పేర్కొంది. అలాగే, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక జోక్యాన్ని నిరసిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన రెండో రాష్ట్రం కేరళ. గతంలో, పంజాబ్ ప్రభుత్వం ఆహార ధాన్యాల సేకరణ సమయంలో కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వం విధించిన రూ.4,000 కోట్లకు పైగా చట్టబద్ధమైన రుసుములను రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై దావా వేసింది.

బహిరంగ చర్చతో పరిష్కరించుకోవాలి


- తమిళనాడు గవర్నర్ అంశంలో సుప్రీంకోర్టు మరోసారి సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిల్లుల ఆమోదానికి సంబంధించిన వివాదాలను బహిరంగ చర్చతో పరిష్కరించుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి, గవర్నర్‌లను సుప్రీంకోర్టు మరోసారి ఆదేశించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచిన గవర్నర్ చర్యపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ధర్మాసనం మరోసారి ఈ సూచనను ముందుకు తెచ్చింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను మళ్లీ రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉందా? లేదా? అనే అంశంపై వివరణాత్మక వాదన వినిపించాలని తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది మను అభిషేక్‌సింఘ్వీ కోరారు. దీనికి స్పందించిన సిజెఐ డివై చంద్రచూడ్ 'జనవరిలోనే విచారిస్తాం. గవర్నర్‌ను కలిసేందుకు కూడా సిఎం సుముఖంగా ఉన్నారు. అది జరగనివ్వండి" అని అన్నారు. వివాదాలను చర్చలతో పరిష్కరించుకోవాలన్న సూచనను మరోసారి ధర్మాసనం ముందుంచింది. అయితే చర్చలతో వివాదాలు పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదని మను అభిషేక్‌సింఘ్వీ అన్నారు. దీనిపై స్పందిస్తూ "ఏం చేయాలో అది చేస్తాం. కానీ, ముఖ్యమంత్రి, గవర్నర్‌లు సమావేశం కావడంలో ఇబ్బంది ఏమిటి? ముఖ్యమంత్రి, గవర్నర్ మధ్య చర్చకు మార్గం ఎప్పుడూ తెరిచి ఉంచాలి. ఒకరితో ఒకరు మాట్లాడుకోనివ్వండి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు.

తక్షణమే కాల్పుల విరమణ పాటించాలి

- జనరల్ అసెంబ్లీలో అనుకూలంగా ఓటు వేసిన భారత్
- రెండు నెలల తర్వాత మారిన భారత్ వైఖరి



న్యూఢిల్లీ : గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఇజ్రాయిల్‌ను కోరుతున్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి అనుకూలంగా భారత్ మంగళవారం ఓటు వేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా పౌరుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, బందీలందరినీ విడుదల చేయాలని ఆ తీర్మానం కోరుతోంది. తీర్మానానికి అనుకూలంగా జనరల్ అసెంబ్లీలో పెద్ద ఎత్తున మెజారిటీ లభించింది. భారత్ సహా మొత్తంగా 153 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా, ఇజ్రాయిల్ సహా పది దేశాలు మాత్రమే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. 23 దేశాలు గైర్హాజరయ్యాయి. వీటిలో యూరప్‌కు చెందిన దేశాలు వున్నాయి.

జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానంపై ఇజ్రాయిల్ అసంతృప్తి చెందింది. అయినప్పటికీ రెండు ప్రతిపాదిత సవరణలకు అనుకూలంగా భారత్ మద్దతు ఇచ్చి, ఓట్లు వేయడాన్ని ప్రశంసించింది. అయితే ఆ సవరణలను జనరల్ అసెంబ్లీ ఆమోదించలేదు. తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసినందుకు భారత్‌లో పాలస్తీనా రాయబారి అదనన్ అబూ అల్ హజియా కృతజ్ఞతలు తెలియచేశారు. 'జరిగింది ఇక చాలు' అని అన్ని దేశాలు పేర్కొనాలని కోరారు. 153 దేశాలు అనుకూలంగా ఓటు చేయగా, అమెరికా మాత్రం వ్యతిరేకంగా ఓటు వేసి, పాలస్తీనియన్ల దారుణ ఊచకోతలో ఇజ్రాయిల్‌కు భాగస్వామినని రుజువు చేసుకుందన్నారు. అక్టోబరు 7న హమాస్, ఇజ్రాయిల్‌పై జరిపిన దాడులను ఈ తీర్మానం ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.

కాగా రెండు మాసాల కాలంలో భారత్ తన వైఖరిని మార్చుకోవడానికి గల కారణమేంటనే విషయమై ఐక్యరాజ్య సమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే ఈ పరిస్థితిని పరిష్కరించడానికి అంతర్జాతీయ సమాజం ఒక ఉమ్మడి ప్రాతిపదికను కనుగొనగలిగిన వాస్తవాన్ని భారత్ స్వాగతించిందన్నారు. ఇటువంటి అసాధారణమై క్లిష్ట పరిస్థితుల్లో సమతూకం పాటించడమే అసలైన సవాలని ఆమె వ్యాఖ్యానించారు.

ఇజ్రాయిల్ సైన్యం కర్కశత్వం

- పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో నిర్వాసితులను చంపేసిన వైనం

గాజా : ఇజ్రాయిల్ ముమ్మరంగా జరుపుతున్న దాడులతో సర్వం కోల్పోయి నిర్వాసితులైన వారు పాఠశాలల్లో తల దాచుకుంటున్నారు. వారిని పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో సైన్యం హతమార్చింది. అల్ ఫలుజా ఏరియాలోని షాదియా అబూ ఘజాలా స్కూల్లో వరుసగా పేర్చబడిన మృతదేహాలకు సంబంధించిన వీడియో, ఫొటోలు మీడియాకు అందాయి. ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థ శిబిరానికి పశ్చిమంగా ఈ స్కూలు వుంది. గాజాలో మంగళవారం జరిగిన దాడుల్లో తమ కల్నల్‌తో సహా 10మంది సైనికులు మరణించారని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. మరోవైపు ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణను పాటించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ఆమోదించింది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 18,608మంది పాలస్తీనియన్లు మరణించారు. కాగా, అక్టోబరు 7నాటి దాడుల తర్వాత నుండి ఇప్పటివరకు అమెరికా నాలుగు దఫాలుగా ఆంక్షలు విధించింది. తాజాగా 8మంది హమస్ అధికారులు, మధ్యవర్తులపై అమెరికా ఆంక్షలు విధించిందని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు. విదేశాల్లో హమస్ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే వారిని ఈసారి లక్ష్యంగా చేసుకున్నట్లు మిల్లర్ తెలిపారు. బ్రిటన్‌తో కలిసి ఈ విషయంలో సమన్వయంగా వ్యవహరిస్తున్నామని మిల్లర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ గురువారం ఇజ్రాయిల్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. రెండు రోజుల ఈ పర్యటనలో ఆయన నెతన్యాహుతో, ఇతర కేబినెట్ సభ్యులతో కలిసి చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. వచ్చే వారం పెంటగన్ చీఫ్ లాయిడ్ ఆస్టిన్ కూడా ఇజ్రాయిల్‌లో పర్యటించనున్నారు. గాజాపై విచక్షణారహితంగా కొనసాగుతున్న దాడుల నేపథ్యంలో ఇజ్రాయిల్ అంతర్జాతీయ మద్దతును, తోడ్పాటును కోల్పోతోందంటూ బైడెన్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఈ పర్యటనలన్నీ జరుగుతున్నాయి.

శ్రీలంకకు ఐఎంఎఫ్ రెండో విడత రుణం

కొలంబో : శ్రీలంకకు రెండవ విడత రుణాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ మంజూరు చేసింది. విస్తరించిన రుణ సదుపాయం (ఇఎఫ్ఎఫ్) కింద 33.7కోట్ల డాలర్ల రుణాన్ని అందచేయనుంది. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక ప్రభుత్వం, ద్వైపాక్షిక పరపతిదారులు రూపొందించిన రుణ ప్రణాళిక ప్రాతిపదికగా ఈ రుణం మంజూరైంది. ఇఎఫ్ఎఫ్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగానే శ్రీలంక, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ చైనా, అధికారిక రుణదాతల కమిటీతో కుదుర్చుకున్న ఒప్పందాలు వున్నాయి. సుస్థిరత దిశగా శ్రీలంక ప్రయాణంలో ఇది కీలకమైన మైలురాయని వాషింగ్టన్ డిసి సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఐఎంఎఫ్ నుండి మొత్తంగా 300కోట్ల డాలర్ల రుణంగా అందుకోవాల్సి వుండగా, అందులో ఈ రెండో విడతను కలుపుకుంటే ఇప్పటివరకు 67కోట్ల డాలర్ల రుణం అందుకుంది. నవంబరులో భారత్, పారిస్ పరపతిదారుల క్లబ్‌తో శ్రీలంక సూత్రప్రాయంగా ఒప్పందం కుదుర్చుకుంది. తాము ఇచ్చిన రుణాలను కూడా పోల్చదగిన నిబంధనలతో పరిగణించేందుకు అంగీకరించినట్లు చైనా కూడా తెలిపింది.

నెతన్యాహు ప్రభుత్వానికి బైడెన్ చీవాట్లు

- ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం వుందని వ్యాఖ్యలు



వాషింగ్టన్ : ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన కరడుగట్టిన ప్రభుత్వాన్ని మార్చుకోవాల్సిన అవసరం వుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా బైడెన్ పరోక్షంగా నెతన్యాహకు చివాట్లు పెడుతూ, భవిష్యత్తులో పాలస్తీనా దేశానికి ఇజ్రాయిల్ నో చెప్పరాదని అన్నారు. విరాళాల సేకరణ కార్యక్రమం సందర్భంగా బైడెన్ చేసిన ఈ వ్యాఖ్యలు చూస్తుంటే గాజాపై ఇజ్రాయిల్ నిరంతరంగా సాగిస్తున్న దాడుల పట్ల అమెరికా ఆందోళన పెరుగుతోందని తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 18వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. అంతర్జాతీయ సమాజం మద్దతును ఇజ్రాయిల్ కోల్పోతోందని బైడెన్ వ్యాఖ్యానించారు. గాజా, వెస్ట్ బ్యాంక్‌లో రక్తపాతం పట్ల అంతర్జాతీయ సమాజం ఆందోళనను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇజ్రాయిల్ చరిత్రలోనే అత్యంత కన్జర్వేటివ్ ప్రభుత్వం ఇదని బైడెన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ జాతీయ భద్రతా మంత్రి ఇతమార్ బెన్ గివిర్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇజ్రాయిల్‌లోని ఈ ప్రభుత్వం పరిస్థితులను చాలా కష్టతరం చేస్తోందని అన్నారు. "ప్రాంతాన్ని ఐక్యం చేసే ప్రక్రియను ప్రారంభించేందుకు మనకు అవకాశం వుంది. దాన్ని చేయాలని వారనుకుంటున్నారు. కానీ, ఈ క్రమాన్ని మరింత బలోపేతం చేయడానికి నెతన్యాహు కొన్ని చర్యలు తీసుకోవాల్సి వుంది. పాలస్తీనా దేశానికి మీరు నో చెప్పలేరు. అది చాలా కఠినమైన అంశంగా వుండనుంది." అని బైడెన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ కేబినెట్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ ఇజ్రాయిల్‌కు వెళ్ళనుండడం కీలక పరిణామంగా వుంది. హమస్‌ను నాశనం చేయాలన్న లక్ష్య సాధనకు అమెరికా మద్దతు తమకు వుందని గత వారమే నెతన్యాహు చెప్పారు.

భారత పర్యటనలో ఎఫ్‌బిఐ ఛీఫ్

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బిఐ) చీఫ్ క్రిస్టోఫర్ వ్రే ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్నారు. రెండు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని చెప్పారు. సిక్కు ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు ఓ భారతీయుడు కుట్ర పన్నాడంటూ అమెరికా ఆరోపణలు చేస్తున్న సమయంలో ఎఫ్‌బీఐ చీఫ్ క్రిస్టోఫర్ వ్రే దేశంలో పర్యటించడం విశేషంగా మారింది. జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ దినకర్ గుప్తాతో క్రిస్టోఫర్ సమావేశం అయ్యారు. ఈ భేటిలో ఈ మార్చిలో ఖలిస్థానీ మద్దతుదారులు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్యకార్యాలయంపై జరిపిన దాడి గురించి ప్రస్తావన వచ్చింది. ఈ దాడిపై అమెరికా దృష్టిపెట్టిందని, త్వరలో దర్యాప్తునకు అవసరమయ్యే కీలక సమాచారాన్ని అందిస్తామని క్రిస్టోఫర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఎపికి 'ఉపాధి'కి బకాయిలు రూ.122 కోట్లు

- కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతన కాంపోనెంట్ కింద ఈ ఏడాది డిసెంబర్1 నాటికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ. 122.75 కోట్లు మాత్రమే ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి వెల్లడించారు. రాజ్యసభలో బుధవారం వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిలు ఈ ఏడాది ఆగస్టు 1 నాటికి రూ.1,019 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఆమె వివరించారు. ఉపాధి హామీ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిధులు విడుదల చేయడమన్నది నిరంతర ప్రక్రియ. క్షేత్రస్థాయిలో పని డిమాండ్‌ను బట్టి వాటికి నిధులు సమకూర్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపుల్లో జాతీయ ఉపాధి హామీ పథకం అమలుకు రూ.60వేల కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనంగా మరో రూ.10వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అయితే గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి నిధులు ఆశిస్తుందని మంత్రి వెల్లడించారు.



ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోడీ

ఎంపి, ఛత్తీస్‌గఢ్‌ల్లో కొత్త సిఎంల ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో బుధవారం కొత్త ముఖ్యమంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. మధ్య ప్రదేశ్ 19వ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ప్రమాణస్వీకారం చేయగా, జగ్‌దీష్ దేవ్డ, రాజేంద్ర శుక్లాలు ఉప ముఖ్యమంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. భోపాల్‌లో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, ఇతరులు పాల్గొన్నారు. గవర్నర్ మంగుభాయి పటేల్ మోహన్ యాదవ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయ్ చేయగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావో, ఎమ్మెల్యే విజయ్ శర్మ ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరందరితో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. 1964 ఫిబ్రవరి 21న జన్మించిన విష్ణుదేవ్ సాయ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. సర్పంచిగా ప్రస్థానం ప్రారంభించి.. నాలుగుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో ప్రధాని మోడీ తొలి కేబినెట్‌లో కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. 2020 నుంచి 2022 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్రంలో ఆదివాసీలు 32 శాతం. దీంతో సీఎం ఎంపికలో అధిష్ఠానం ఆయనవైపు మొగ్గు చూపింది. కాగా, రాజస్థాన్‌లో ఈ నెల 15న ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

భద్రత డొల్ల

(మొదటి పేజీ తరువాయి)

సాక్ష్యాధారాలు సేకరించారు. లోక్‌సభలో జరిగిన ఘటనపై స్పీకర్ ఓం బిర్లా ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. శివసేన ఎంపీ అరవింద్ కథనం ప్రకారం...నిందితులలో ఒకడిని ఓ ఎంపీ పట్టుకున్నారు. ఆ సమయంలో మరో దుండగుడు బెంచీలపై గెంతుతూ భయానక వాతావరణాన్ని సృష్టించాడు. కాలి బూటును విప్పి అందులో దాచిన గ్యాస్ డబ్బాను తెరిచాడు. దీంతో ఆ ప్రదేశమంతటా పసుపుపచ్చని రంగులో పొగ వ్యాపించింది. 'నియంతృత్వాన్ని అనుమతించకూడదు' అని దుండగులు నినాదాలు చేసినట్లు కొందరు ఎంపీలు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో సభాపతి స్థానంలో బీజేపీ ఎంపీ రాజేంద్ర అగర్వాల్ కూర్చున్నారు. 'సందర్శకుల గ్యాలరీ నుండి ఎవరో పడిపోయారని తొలుత సభ్యులు భావించారు. అప్పుడే రెండో వ్యక్తిని చూశాం. వారిలో ఒకరు తన బూటు నుండి ఒక క్యాన్‌ను బయటకు తీసి స్ప్రే చేశారు. ఎంపీలు గుర్జిత్ సింగ్ ఓజ్ల (కాంగ్రెస్), గోరంట్ల మదధవ్ (వైసిపి) హనుమాన్ వానియల్ (బిజెపి) వారిని పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఇది జరిగినప్పుడే పార్లమెంటు వెలుపల ఒక మహిళతో సహా ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వారిలో ఒకరు హర్యానాలోని హిస్సార్‌కు చెందిన నీలం(42), మరొకరు మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ షిండే (25)గా భద్రతా దళాలు గుర్తించాయి. ఈ సంఘటన జరిగిన వెంటనే అగర్వాల్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశమైంది. ఘటనపై విచారణ జరుగుతోందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. 'సభలో ప్రవేశించిన ఇద్దరిని, సభ వెలుపల ఇద్దరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను లలిత్, విక్రమ్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులందరూ తమ బూట్లలో పొగ డబ్బాలను తీసుకెళ్లారని నివేదికలు చెబుతున్నాయి. "తమకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" అని నిందితులు మీడియాతో అన్నారు.వివిధ ఏజెన్సీలు ఏకకాలంలో నిందితులను విచారించాయి. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ఆరుగురు సోషల్ మీడియాలో ఒకరికొకరు కనెక్ట్ అయినట్లు భద్రతా దళ వర్గాలు తెలిపాయి. ఫోరెన్సిక్ బృందం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుండి నమూనాలను సేకరించడం పూర్తి చేసింది.ఆరుగురు నిందితులు ఒకరికొకరు ఆరేళ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు. ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరికి మాత్రమే విజిటర్స్ పాస్ లభించడంతో లోపలికి వెళ్లారు.పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేలా ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఆరుగురు నిందితులకు "సూచనలు" ఇచ్చారా? అని భద్రతా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. దుండగులు విడుదల చేసిన వాయువు హానికరమైనది కాదని ప్రాథమిక విచారణలో తేలింది' అని చెప్పారు. జరిగిన ఘటనపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. '2001లో పార్లమెంట్‌పై దాడి జరిగింది. దానికి గుర్తుగా 19వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆ సమయంలో అమరులైన భద్రతా సిబ్బందికి నివాళి అర్పిస్తున్నాం. ఇప్పుడు అదే సమయంలో దాడి జరగడం పలు ప్రశ్నలను రేకెత్తిస్తోంది' అని కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి అన్నారు. 'ఉండాల్సినంత భద్రత లేదా? ఎంపీలందరూ కలిసి దుండగులను పట్టుకున్నారు. మరి ఇతర భద్రతా సిబ్బంది ఎక్కడ ఉన్నారు?' అని నిలదీశారు. ఈ ఘటన చాలా తీవ్రమైనదని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ వ్యాఖ్యానించారు. ఈ ఘటన భద్రతాపరమైన ఉల్లంఘనేనని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ అన్నారు. సభకు వచ్చే వారికి ట్యాగ్‌లు ఉండవని అంటూ దీని గురించి ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ సభ్యులు వ్యక్తం చేసిన ఆందోళనను గమనించానని, ఇకపై సందర్శకులకు పాస్‌లు ఏ విధంగా జారీ చేయాలనే విషయంపై ఎంపీలతో చర్చిస్తానని అన్నారు. సభ జీరో అవర్‌లో ఈ ఘటన జరిగిందని స్పీకర్ తెలిపారు. సభా కార్యక్రమాలు జరగకుండా ఎవరూ నిరోధించలేరని ఆయన సభ్యులకు హామీ ఇచ్చారు. మరో ఇద్దరు నిందితులను లలిత్, విక్రమ్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులందరూ తమ బూట్లలో పొగ డబ్బాలను తీసుకెళ్లారని నివేదికలు చెబుతున్నాయి. "తమకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" నిందితులు మీడియాతో అన్నారు.వివిధ ఏజెన్సీలు ఏకకాలంలో నిందితులను విచారించాయి. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ఆరుగురు సోషల్ మీడియాలో ఒకరికొకరు కనెక్ట్ అయ్యారు.ఆరుగురిలో నలుగురిని అరెస్టు చేయగా, ఐదుగురిని గుర్తించగా, ఒకరిని గుర్తించాల్సి ఉంది.ఫోరెన్సిక్ బృందం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ నుండి నమూనాలను సేకరించడం పూర్తి చేసింది.ఆరుగురు నిందితులు ఒకరికొకరు ఆరేళ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు. ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరికి మాత్రమే విజిటర్స్ పాస్ లభించడంతో లోపలికి వెళ్లారు. పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేలా ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఆరుగురు నిందితులకు "సూచనలు" ఇచ్చారా? అని భద్రతా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.





మీకోసం

ఒక టేబుల్ స్పూను తేనెలో అర టేబుల్ స్పూను అల్లం రసం కలిపి రోజుకు మూడుసార్లు తీసుకుంటే జలుబు తగ్గుతుంది.

జీవన సౌరభం

కేవలం విజయాల నుండే కాదు, అపజయాల నుంచీ ఎదగడం నేర్చుకోవాలి.

JEEVANA జీవన the family

గంగయ్య ఉపాయం



గుట్టకు పక్కన గంగయ్యకు రెండు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో శనగ పంటను పండించేవాడు. ఆ గుట్టను ఆనుకొని ఉన్న అడవిలో నుంచి అడవి పందులు వచ్చి చేనును పాడు చేసేవి. కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా పంట చేతికొచ్చే సమయానికి, మొక్కలను పీకేసి శనగ కాయలను తిని వెళ్ళేవి. పంట అంతా పాడు చేసేవి.

ప్రతి సంవత్సరం ఇలా జరుగుతుండడంతో గంగయ్య చాలా నష్టపోయాడు. ఏమి చేయాలో అర్థం కాలేదు. 'ఈ ఏడాది మాత్రం, ఎలాగైనా పంటను కాపాడుకోవాలి' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైంది.

పక్క ఊరిలో ముత్యాలమ్మ జాతర జరుగుతోంది. అక్కడ కొన్ని సింహాల బొమ్మలు కొన్నాడు. వాటిని చేను చుట్టూరా పెట్టాలి అని నిర్ణయించుకున్నాడు. చేను గట్టు వెంట ఆ బొమ్మలను ఉంచాడు. రాత్రిపూట అవి కనిపించే విధంగా లోపల కరెంటు బల్బులను అమర్చాడు. ఆ సింహాల బొమ్మలకు దగ్గరగా సౌండ్ బాక్స్‌ను ఉంచాడు. ఆ రాత్రి మంచె పైన కూర్చొని చేను కాపలా కాశాడు. అర్ధరాత్రి దాటాక, చేను వైపు అడవి పందుల గుంపు వచ్చింది. అడవి పందుల గుంపు రాగానే తన మొబైల్‌కు కనెక్ట్ చేసిన సింహ గర్జన ప్లే చేశాడు. సౌండ్ బాక్సుల నుంచి ఆ గర్జనలు విన్న అడవి పందులు పరుగందుకున్నాయి. మరుసటి రోజు అర్ధరాత్రి కూడా అలాగే చేశాడు.



అలా గంగయ్య తన ఉపాయంతో ఈ ఏడాది పంటను కాపాడుకున్నాడు. మంచి దిగుబడి వచ్చింది. గంగయ్య ఉపాయానికి గ్రామస్థులందరూ మెచ్చుకున్నారు.

– అన్నెపంగు వరుణ్ రెడ్డి
– దరావత్ భవానీ శంకర్

పదబంధాలు

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలను ఇచ్చాం. వాటికి సమాన అర్థం వచ్చే పదాలు మీరు రాయండి. క్లూ ఆధారంగా అవన్నీ ఒకే అక్షరంతో మొదలవ్వాలి మరి. ట్రై చేయండి చూద్దాం.

ఎండాకాలం	వే--
ఎగతాళి	వే---
జీతం	వే--
తొందర	వే---
మురళి	వే--
ఉదయం	వే--
బాధ	వే--
ఓ శతక కవి	వే--

నేను గీసిన బొమ్మ





బి.ఆదర్శ,
2వ తరగతి,
అమర జ్యోతి స్కూలు,
పాతపట్నం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇంధన పొదుపు .. అందరి బాధ్యత ...

నేడు జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

ధనమూ, ఇంధనమూ ... సమాజాన్ని నడిపించటంలో కీలకపాత్ర పోషిస్తాయి. రెండు శ్రమ జనితాలే! కాబట్టి జాగ్రత్తగా వాడుకోవాలి. చేతిలో ఉన్న దానిని తెలివిగా, పొదుపుగా వినియోగించుకోవాలి. నేడు మన కోసమే కాదు; భవిష్యత్తు తరాల అవసరాల కోసమూ ఇంధన పొదుపు అన్ని విధాలా అవసరమని ఆర్థిక నిపుణులు, పర్యావరణ హితులూ చెబుతున్నారు. జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా ... ఆ సంగతులను ఓ సారి గుర్తు చేసుకుందాం!

ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే పెట్రోలు వాహనాలు... ఇంట్లో భోజనం సిద్ధం చేయాలంటే గ్యాస్... గృహాల్లో జీవనం సాఫీగా సాగాలంటే విద్యుత్తు ... మన నిత్య జీవితానికి ఎంతో అవసరం. ఇవన్నీ ఇంధన వనరుల్లో భాగమే! ప్రకృతి వనరుల నుంచి ఇవి లభ్యమవుతాయన్న విషయం తెలిసిందే! మనిషి తన ఇష్టానుసారం ప్రకృతి వనరులను వాడేస్తుంటే – భవిష్యత్తులో తీవ్ర కొరత ఏర్పడుతుంది. కాబట్టి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మనమందరం మళ్లాల్సిన అవసరం ఉంది. ఆ విధంగా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుంది.

అందుకనే ఇప్పుడు అన్ని దేశాల్లోనూ పెట్రోలుతో నడిచే వాహనాల స్థానే విద్యుత్ వాహనాలు ముందుకు వచ్చాయి. మన దేశంలో కూడా వీటి వినియోగం నానాటికీ పెరుగుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు అమాంతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజలు తమపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించుకోవటానికి ఎలక్ట్రికల్ వాహనాలను ఎంచుకుంటున్నారు. దీనివల్ల వాయు, శబ్ధ కాలుష్యం కూడా తగ్గుతుంది.



కుకింగ్ స్టవ్‌లు

ఇప్పుడు గ్యాసును, విద్యుత్‌ను పొదుపు చేసే గృహోపకరణాలు చాలా అందుబాట్లోకి వచ్చాయి. బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఇండక్షన్ కుకింగ్ స్టవ్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఇండక్షన్ స్టవ్ ద్వారా సంప్రదాయ వంట పద్ధతులకు మించి సుమారు 25 నుంచి 30 శాతం ఇంధనం ఆదా అవుతుంది. తక్కువ ఖర్చుతో వంటను పూర్తిచేయొచ్చు. ఈ స్టవ్‌లు పర్యావరణ హితం కూడా! ఈ స్టవ్‌లు అనేక రూపాల్లో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.




ఈ-విద్యుత్ వాహనాలు : ప్రపంచవ్యాప్తంగానూ, మన దేశంలోనూ ఈ-విద్యుత్ ద్విచక్ర వాహనాల వినియోగం పెరుగుతోంది. మామూలు వాహనాలతో పోలిస్తే ధర ఎక్కువగా ఉన్నప్పటికీ నిర్వహణ ఖర్చు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల తక్కువ దూరం ప్రయాణించేవారు, పట్టణ, నగర ప్రాంతాల్లో ఉండేవారు ఈ-వాహనాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. మంచి మైలేజీ, స్టైల్, ఇంజన్ సామర్థ్యం ఉండటంతో వీటి వినియోగంపై ఆసక్తి పెరిగింది. ఏథర్ ఎనర్జీ, బజాజ్, టీవీఎస్, హీరో, ఎడిఎంఇ ఈ-బైక్‌లకు మంచి ఆదరణ ఉంది. భవిష్యత్తులో వీటి లభ్యత, వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. బ్యాటరీ ఛార్జింగు, సర్వీసు అందుబాటులో ఉన్న సమస్యలు పరిష్కరిస్తే ఈ-బైకుల



వినియోగం మరింత పెరుగుతుంది. దీనిపై గతేడాది వరకూ కేంద్ర ప్రభుత్వం ఎక్కువ రాయితీ ఇచ్చేది. ఈ మధ్య తగ్గించింది. ఈ-సైకిళ్లు కూడా మార్కెట్లో ఉన్నాయి. దగ్గరి ప్రయాణాలకు మామూలు సైకిళ్లు వాడడం ఆరోగ్యానికి, ఆర్థిక పొదుపునకు చాలా దోహదం చేస్తుంది. తక్కువ దూరాలకు బైకులు వాడకుండా నడిచివెళ్లటం కూడా మంచిది. అత్యవసరం కానప్పుడు సొంత కార్లు, బైకులు వాడటం కన్నా ప్రజా రవాణాను ఉపయోగించటం మేలు.

ఫ్యాన్లు, లైట్లు



తక్కువ విద్యుత్‌ను ఉపయోగించే ఫ్యాన్లు నేడు మార్కెట్లో ఉన్నాయి. విద్యుత్ బిల్లు కూడా తక్కువగానే వస్తుంది. 35 శాతం విద్యుత్ ఆదా అవుతుంది. గతంలో ఎల్ఇడి బల్బులు వాడే చోట్ల ఎల్‌సిడి బల్బుల వినియోగంతో విద్యుత్ ఆదా అవుతుంది. అధునాతన ఎలక్ట్రికల్ స్టవ్‌లు, బల్బులతో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి.

ఎల్ఈడీ బల్బులు



లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్ఈడీ) బల్బులు తెల్లని కాంతిని ప్రకాశింప జేయటంతో పాటు విద్యుత్‌ను ఆదా చేస్తాయి. విద్యుత్ బిల్లును తగ్గించేందుకు దోహదపడతాయి. ఎల్ఈడీ బల్బులు దీర్ఘకాలంగా పనిచేస్తాయి. అతి తక్కువ వేడిని విడుదల చేస్తాయి. ఇళ్లల్లో ఉపయోగించటం ద్వారా 95 శాతం విద్యుత్‌ను ఆదా చేయొచ్చు. గృహాలు, వాణిజ్య అవసరాలకు సాధారణ విద్యుత్ ఉపకరణాలను వినియోగించటం వల్ల విద్యుత్ వినియోగం అధికంగా ఉంటోంది. వాటి స్థానంలో ఆధునిక పరికరాలను వినియోగిస్తే 15 శాతం విద్యుత్ వృథాను తగ్గించొచ్చు.

ఇథనాల్

పర్యావరణ హితంగా, కాలుష్య రహితంగా ఉండటానికి పలు దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనంగా ఇథనాల్‌ను వినియోగిస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఇథనాల్ ఉత్తమ పరిష్కారం. ఇథనాల్, గ్యాసోలిన్ మిశ్రమం పర్యావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని తగ్గిస్తుంది. ఇది ఫ్యూయెల్స్‌తో పోలిస్తే శుభ్రంగా మండుతుంది. పెట్రోలు, డీజిల్, గ్యాస్ వినియోగంతో ప్రమాదకరమైన గ్రీన్‌హౌస్ వాయువులు, ఉద్గారాల కారణంగా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడుతుంది. ఇథనాల్ వినియోగం వల్ల పర్యావరణ నష్టాన్ని తగ్గించొచ్చు.

సౌర విద్యుత్తు

గృహాలు, ఆఫీసులపై సౌరఫలకాలను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తే కర్బన ఉద్గారాల బెడద తగ్గి పర్యావరణానికి మేలు కలుగుతుంది. ఈ పథకానికి ప్రభుత్వం రాయితీలు ఇచ్చి, ప్రోత్సహిస్తోంది. ప్రారంభంలో ఎక్కువ పెట్టుబడి పెట్టటానికి సిద్ధపడితే ఇళ్లకు, మోటార్లకు సౌర విద్యుత్‌ను సులభంగా, ఉచితంగా పొందవచ్చు.


మన భూగోళం ఆరోగ్యంగా ఉండటానికి, మనపై ఆర్థిక భారం తగ్గటానికి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు దృష్టి సారించాలి. ఒక్కో కుటుంబం ఒక్క నెలకు ఒక్క యూనిట్ విద్యుత్తును, ఒక్క లీటరు పెట్రోలును పొదుపు చేస్తే– దేశంలో కొన్ని కోట్ల ఖర్చు మిగులుతుంది. భూగోళం ఆరోగ్యం కొంత శాతమైనా చెడిపోకుండా కాపాడబడుతుంది.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.


మా చిరునామా : రంగవల్లి, ప్రజాశక్తి దినపత్రిక ప్రజాశక్తి భవనం, అరవింద హైస్కూలు దగ్గర, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com వాట్సాప్ : 83329 25496

రానా నాయుడు రికార్డు



హీరోలు రానా, వెంకటేష్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు' నెట్ ఫ్లిక్స్ వేదికగా విడుదలైన విషయం తెలిసిందే. 2023 జనవరి నుంచి జూన్ వరకు ఎక్కువ వ్యూస్ వచ్చిన వాటి వివరాలను నెట్‌ఫ్లిక్స్ తాజాగా వెల్లడించింది. ఇందులో 'రానా నాయుడు' చోటు దక్కించుకుంది. 2021 నుంచి నెట్‌ఫ్లిక్స్ ప్రతి వారం ఎక్కువ వ్యూస్ సాధించిన టాప్ 10 మూవీస్, వెబ్ సిరీస్‌ల లిస్ట్ విడుదల చేస్తూ వస్తోంది. ఈసారి ఆరు నెలల జాబితాను విడుదల చేసింది. వ్యూస్ ఆధారంగా సుమారు 18 వేల టైటిల్స్ డేటాను పరిశీలించింది. గ్లోబల్‌గా ఎక్కువ వ్యూస్‌ను సొంతం చేసుకున్న టాప్ 400ను విడుదల చేసింది. ఇందులో 'రానా నాయుడు' టాప్ 336లో నిలిచింది. భారత్ నుంచి ఈ సిరీస్ మాత్రమే టాప్ 400లో స్థానం దక్కించుకుంది. దీన్ని 46 మిలియన్ల గంటలు చూసినట్లు ఆ సంస్థ తెలిపింది. అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్'కు రీమేక్‌గా ఈ సిరీస్ రూపొందింది.

'ఓహ్ మై బేబీ...' పాట విడుదల



మహేష్ బాబు ప్రధాన పాత్రలో, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గుంటూరు కారం' చిత్రం నుండి తాజాగా ఓహ్ మై బేబీ అంటూ సాగే పాటను విడుదల చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 12న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్రం రిలీజ్ కి డేట్ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో శ్రీ లీల, మీనాక్షి చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హారిక, హాసిని క్రియేషన్స్‌పై ఎస్ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించారు.

స్కూల్‌డ్రెస్‌లోనే ఆడిషన్స్‌లో పాల్గొన్నా : ఆలియాభట్



'నేను 11వ తరగతి చదువుతున్న సమయంలో ఒకరోజు నాకు కరణ్ జోహార్‌తో మీటింగ్ ఉన్నట్లు ఫోన్‌కాల్ వచ్చింది. స్కూల్‌లో ఉన్న నేను యూనిఫామ్‌తో కరణ్‌ని కలవడానికి ఆయన ఆఫీస్‌కి వెళ్లాను. అప్పుడు నేను ఎక్కువ ఫ్రెంచ్ ఫ్రైస్ తింటూ చాలా బొద్దుగా ఉండేదాన్ని. నన్ను చూసిన వెంటనే ఆడిషన్ ఇవ్వాలని అన్నారు' అని బాలీవుడ్ నటి ఆలియాభట్ అన్నారు. తన తొలి సినిమా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'ను గుర్తుచేసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో ఆమె పోస్టు పెట్టారు. ఇటీవల జడ్డాలో జరిగిన రెడ్ సీ ఫిల్మ్ ఫెస్టివల్ 2023లో పాల్గొన్న అలియా తన మొదటి సినిమా ఆడిషన్ ఎలా జరిగిందనే జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు. 'ఆడిషన్ అంటే ఏమిటో తెలియకుండానే లోపలికి వెళ్లి పాల్గొన్నాను. నేను ఆ సినిమాలో నాయికగా ఎంపికయ్యానని కరణ్ చెప్పిన ఆ క్షణం నాకు కన్నీళ్లు ఆగలేదు. ఆనందంతో ఒక కప్ కేక్ తినొచ్చా అని కరణ్‌ను అడిగా(నవ్వుతూ). ఆ విషయం తెలిసిన మా అమ్మ నేను సినిమాల్లో నటించడానికి కొంచెం సంకోచించినా మా నాన్న మాత్రం అంగీకరించారు' అంటూ గుర్తుచేసుకుంది. ప్రస్తుతం 'జిగ్రా' సినిమాలో ఆమె నటిస్తున్నారు.



ఎన్టీఆర్‌తో కలిసి నటించాలని ఉంది : తృప్తి డిమ్రి

'నాకు అవకాశం వస్తే ఎన్‌టిఆర్‌తో కలిసి నటిస్తానని నటి తృప్తిడిమ్రి వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన యానిమల్ చిత్రంలో ఆమె జోయా అనే అతిథి పాత్రలో నటించిన విషయం తెలిసిందే. రణబీర్ కపూర్, రష్మిక ఇందులో హీరో హీరోయిన్లు. 'దక్షిణాదిలో ఎన్టీఆర్‌తో కలిసి నటించాలని ఉంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో తృప్తిడిమ్రి పెట్టిన పోస్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఏలియన్‌కి స్వరమిచ్చిన సిద్ధార్థ్



తమిళ నటుడు శివ కార్తికేయన్ తాజా ప్రాజెక్టు 'అయలాన్.' సంక్రాంతికి విడుదలవుతున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కింది. ఈ మూవీలో ఏలియన్ పాత్రని సృష్టించారు. తాజాగా ఆ ఏలియన్ పాత్రకి వాయిస్‌ని ఇచ్చారు హీరో సిద్ధార్థ్. డబ్బింగ్ కంప్లీట్ చేసిన సిద్ధార్థ్‌కి థాంక్స్ చెప్తూ 'అయలాన్' చిత్రబృందం స్పెషల్ ట్వీట్ చేశారు. ఈ సినిమాని రవికుమార్ డైరెక్ట్ చేశారు. రెహమాన్ మ్యూజిక్‌తో, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారు. కెజెఆర్ స్టూడియోస్ బ్యానర్‌పై కోటపాడి జె రాజేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రకుల్‌ప్రీత్‌సింగ్, యోగిబాబు, కరుణాకరన్, శరద్ కేల్కర్, ఇషా కొప్పికర్, తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు.


కీరవాణి కోడలిగా మురళీ మోహన్ మనవరాలు



'నాకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కూతురు పెళ్లి చేసుకుని విదేశాల్లో సెటిలైంది. తనకు ఓ అమ్మాయి సంతానం. ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లో తన వివాహం జరగనుంది. అలాగే నా కొడుక్కి ఓ కూతురు సంతానం. ఈమె పెళ్లి కూడా దాదాపు ఖాయమైపోయింది. అందరూ ఊహించినట్లుగానే కీరవాణి ఇంటికి కోడలిగా వెళ్లనుంది. పెద్ద మనవరాలి పెళ్లి ఫిబ్రవరిలో అయితే చిన్న మనవరాలి పెళ్లి వచ్చే ఏడాది చివర్లో జరగనుంది' అని మురళీమోహన్ తన మనుమరాళ్ల పెళ్లి ముచ్చట్లు చెప్పారు. గత కొన్ని రోజులుగా ఈ విషయంపై వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వాటిపై స్పందించారు. మురళీ మోహన్ కొడుకు పేరు రామ్ మోహన్. ఈయన ఏకైక కుమార్తె రాగ. కొద్దిరోజుల క్రితమే ఆమె బిజినెస్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. కీరవాణి రెండవ అబ్బాయి శ్రీసింహాతోనే రాగ వివాహం జరగనుంది.

'హాల్ ఆఫ్ ఫేమ్'కు లియాండర్, అమృతరాజ్ ఎంపిక

- తొలి ఆసియా టెన్నిస్ ఆటగాళ్లుగా రికార్డు



న్యూయార్క్: అంతర్జాతీయ టెన్నిస్ 'హాల్ ఆఫ్ ఫేమ్'కు ఆసియా ఖండం నుంచి సీనియర్ టెన్నిస్ ఆటగాళ్లు లియాండర్ పేస్, వెటరన్ విజయ్ అమృతరాజ్ ఎంపికయ్యారు. ఈ మేరకు 'హాల్ ఆఫ్ ఫేమ్' ట్విటర్ వేదికగా బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన లియాండర్ టెన్నిస్‌లో భారత్‌నుంచి చిరస్మరణీయ విజయాలను అందుకున్నాడు. ఒలింపిక్స్‌లోనూ పురుషుల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. మాజీ టెన్నిస్ దిగ్గ ఆటగాడు విజయ్ అమృతరాజ్ కంట్రిబ్యూషన్ కేటగిరీలో ఎంపికయ్యాడు. అమృతరాజ్ ప్రస్తుతం బ్రాడ్‌కాస్టర్, టెన్నిస్ ప్రమోటర్‌గా కొనసాగుతున్నాడు. పురుషుల టెన్నిస్ విభాగం నుంచి ఈ అవార్డుకు ఎంపికైన తొలి భారత, ఆసియా ఆటగాళ్లు. న్యూఫోర్ట్, రోడ్ ఐలాండ్‌లోని హాల్ 1955 నుంచి ఈ అవార్డులను ప్రతి ఏడాది ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ఎంపిక చేసి 'హాల్ ఆఫ్ ఫేమ్' అవార్డులను ప్రకటిస్తోంది.

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష..

- నేడు దక్షిణాఫ్రికాతో మూడో, చివరి టి20
- రాత్రి 8.30గం॥లకు

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనకు టి20 ఫార్మాట్‌లో యువ క్రికెటర్లతో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో దక్షిణాఫ్రికా జట్టు 15ఓవర్లలో 152 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి రాగా.. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 13.5ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు టి20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దుకాగా.. రెండో టి20లో నెగ్గిన సఫారీ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఈ క్రమంలో ఆ జట్టు 2-0తో భారత్‌పై నెగ్గితేనే సిరీస్ దక్కనుండగా.. భారత్ ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్‌ను సమం చేయనుంది. యువ క్రికెట్లు జైస్వాల్, శుభ్‌మన్, తిలక్‌వర్మకు తోడు జితేశ్ శర్మకు ఈ మ్యాచ్ కీలకం కానుంది.

ఫైనల్‌కు హర్యానా

- సెమీస్‌లో తమిళనాడుపై 63పరుగుల తేడాతో గెలుపు
- విజయ్ హజారే వన్డే టోర్నీ



రాజ్‌కోట్: విజయ్ హజారే వన్డే టోర్నీ ఫైనల్లోకి హర్యానా జట్టు దూసుకెళ్లింది. సౌరాష్ట్ర స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్లో హర్యానా జట్టు 63పరుగుల తేడాతో తమిళనాడుపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హర్యానా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 293పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తమిళనాడు జట్టు 47.1ఓవర్లలో 230పరుగులకే ఆలౌటైంది. హర్యానా జట్టు హిమాన్షు రాణా(116) సెంచరీకి తోడు ఓపెనర్ యువరాజ్ సింగ్(65) అర్ధసెంచరీతో రాణించారు. తమిళనాడు బౌలర్లు నటరాజన్‌కు మూడు, వరుణ్ చక్రవర్తి, సాయి కిషోర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తమిళనాడు ఓపెనర్లు బాబా ఇంద్రజిత్(7), జగదీశన్(30), నిషాంత్(1), విజయ్ శంకర్(23) నిరాశపరిచినా.. బాబా ఇంద్రజిత్(64), కెప్టెన్ దినేశ్ కార్తీక్(31) బ్యాటింగ్‌లో రాణించారు. ఆ తర్వాత లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ నిరాశపరచడంతో తమిళనాడు 230పరుగులకే ఆలౌటైంది. అన్షుల్ కంబోజ్‌కు నాలుగు, రాహుల్ తెవాటియాకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హిమాన్షు రాణాకు లభించగా.. రెండో సెమీస్ రాజస్తాన్-కర్ణాటక జట్ల మధ్య గురువారం జరగనుంది.

అంతిమ్‌కు 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డు



ముంబయి: భారత మహిళా యువ రెజ్లర్ అంతిమ్ పంగల్(19)కు ప్రతిష్టాత్మక 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. 2023 ఏడాదికిగాను అంతిమ్‌కు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) ఈ ప్రతిష్టాత్మక ఈ అవార్డును అందజేసింది. రెండేళ్లుగా అద్భుత విజయాలతో పతకాలు కైవసం చేసుకోవడంతోపాటు 2024 పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత సాధించింది. అంతిమ్‌కు ఈ అవార్డు దక్కడం ఆమెకు ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచింది. గతేడాది అండర్-20 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో అంతిమ్ మూడో స్థానంలో నిలువగా.. ఈ ఏడాది ఏకంగా ఛాంపియన్‌గా నిలిచింది. 2020లో జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అంతిమ్.. ఆ తర్వాత అండర్-23 ఆసియన్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో స్థానం నిలిచింది. హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా క్రీడలలో కాంస్యం గెలిచింది.



బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీస్‌కు ఆంధ్ర జట్టు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ అండర్ - 19 జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. ఈ టోర్నీలో ఆంధ్ర బాలికల జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్ పోటీల్లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు 2- 0 పాయింట్లతో హర్యానా జట్టుపై గెలిచింది. బాలుర విభాగంలో మహారాష్ట్ర జట్టు 2-0 పాయింట్లతో మధ్యప్రదేశ్ జట్టుపై, కేరళ జట్టు 2-0 పాయింట్లతో రాజస్థాన్ జట్టుపై విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68